



కలెక్టరేట్ ఎదుట మౌన దీక్ష చేపడుతున్న నాయకులు

కౌలు రైతుకు మొండిచేయే..!

•ఇప్పటికీ అందని అన్నదాత సుఖీభవ •80 శాతం సాగు కౌలు రైతుల చేతుల్లోనే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కౌలు రైతులకు అన్నింటా మొండిచేయే దక్కుతోంది. అన్నదాత సుఖీభవలోనూ వారికి అదే పరిస్థితే ఎదురవుతోంది. 80 శాతం సాగు కౌలు రైతుల చేతుల్లోనే ఉన్నా ఇప్పటికీ వారికి అన్నదాత సుఖీభవ అంద లేదు..

కూటమి ప్రభుత్వం కౌలురైతులను వంచించిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పంట పండించే కౌలురైతులను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం సొమ్ము కౌలు రైతులకు చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి ఉంది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద కౌలురైతులకు సైతం రూ.20 వేలు అందిస్తామంటూ కూటమి ప్రభుత్వం తెలిపింది. అధికారంలోకొచ్చి రెండేళ్ల కావొస్తున్నా ఇప్పటి వరకూ కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. 2024 జూన్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ రెండు ఖరీఫ్, ఒక రబీ సీజన్లు పూర్తయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. గడిచిన ఖరీఫ్ ఆరంభం నుంచి పెట్టుబడి సాయం సొమ్ము జమ చేయడం ప్రారంభించింది. మరో విడత సొమ్ము జనవరిలో వేయాల్సి ఉంది. భూయజమానులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేసిన ప్రభుత్వం కౌలురైతులను మాత్రం పూర్తిగా పక్కన పెట్టింది. కర్నూలులో 2,77,752 మంది రైతులను, నంద్యాల జిల్లాలో 2.07 మంది రైతులను లబ్ధిదారులుగా ప్రకటించారు. వారికి నగదు జమ చేసినట్లు అధికారులు ప్రకటించారు. అక్టోబర్లో కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ నెల పూర్తవుతూ, రబీ సాగు ఆరంభమైనా పెట్టుబడి సాయం సొమ్ము మాత్రం ఇవ్వలేదు. దీంతో తాము చేసిన నేరం ఏమిటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు.



పంట నష్ట పరిహారమూ లేదు

మొంథా తుపానుకు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది. వెబ్ ల్యాండ్ ఆధారంగా పంటనష్టం నమోదు జరిగింది. దీంతో సాగుచేసిన కౌలురైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లను పంటనష్టం జాబితాలో చేర్చారు. దీంతో పంటనష్టం సొమ్ము సైతం కౌలురైతులకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పంటల బీమా సొమ్ము సైతం భూయజమానులకే అందనుంది. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టాన్ని సవరిస్తామని, కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హడావుడి సైతం చేశారు. తర్వాత మౌనం వహించారు. సాగు చేసే వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయ సాగులో కౌలు రైతులదే కీలకపాత్ర. అటువంటి కౌలురైతుల తరపున ప్రజాప్రతినిధులు ఏఒక్కరూ కనీసం నోరువిప్పని పరిస్థితి ఉంది. అధికారులు సైతం కౌలురైతుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. సమావేశాల్లో కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ప్రకటనలు చేయడం తప్ప పర్యవేక్షణ లేకుండాపోయింది. ఇప్పటికైనా కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము అందించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

విబిజి రామ్‌జి స్కీమ్ రద్దు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మౌన దీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన విబిజిరామ్‌జి స్కీమ్ (వికసిత్‌భారత్ గ్యారెంటీపర్ రోజ్‌గార్‌అజీవికా మిషన్ (గ్రామీణ్) రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గతంలో తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన విబిజిరామ్‌జి స్కీమ్ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో మౌనదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 12 సంవత్సరాల కాలంలో ప్రజలకు మేలు చేయకపోగా మతం పేరుతో, కులం పేరుతో ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ కాలం గడపడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశంలో నూటికి 20 శాతం మంది పేదలకు మూడుపూటలా తిండి లేక అర్థాలతో ఉన్నటువంటి వారికి, పనులు లేక వలసలు వెళ్లే పేదల కోసం, 2005లో ఆనాటి యుపిఎ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న వామపక్షాల ప్రోత్బలంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టడం కోసం తెచ్చిన ఈ చట్టాన్ని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉపాధి హామీ చట్టంలో అనేక మార్పులు తెస్తూ క్రమంగా చట్టాన్ని స్కీమ్‌గా మార్చి రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దేశంలో కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న ఈ ప్రభుత్వం పేదల పట్ల చిన్నచూపు చూస్తుందని విమర్శించాడు. గత పదేళ్లలో ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ వస్తున్నారని, రెండు పూటలా పని విధానం తీసుకుని వచ్చారని, పనిచేసిన కూలీలకు వారంలోగా వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్న నేటికీ ఐదు నెలలైనా బకాయిలు చెల్లించక పోవడం చూస్తుంటే మతోన్మాద ప్రభుత్వానికి పేదల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని విమర్శించాడు. కేంద్ర ప్రభుత్వం అనే పేరుతో తెచ్చిన పథకంలో రాష్ట్ర ప్రభుత్వాలపై భారాలు వేసిందని ఈ పథకానికి పూర్తిస్థాయి నిధులు కేంద్ర ప్రభుత్వమే భరించాలని, చట్టంలో ఉన్నప్పటికీ దానిని తుంగలో తొక్కిందని, కేంద్రం 60 శాతం రాష్ట్రం 40శాతం వాటాలు చెల్లించేలా పథకాన్ని విమర్శించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 శాతం నిధులు చెల్లించడానికి సిద్ధమేనా దీనికి సమాధానం ఏంటో రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చెప్పాలని ఆయన డిమాండ్ చేశాడు. పార్లమెంటులో అడ్డగోలుగా బిల్లు పెడితే మన రాష్ట్రంలో ఉండే 25 మంది అధికార ప్రతిపక్ష పార్టీల పార్లమెంటు సభ్యులు బిల్లుకు ఆమోదం తెలపడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కర్నూలు జిల్లాలో ప్రజలు నిత్యం కరువు, కాటకాలతో అల్లాడుతుంటే ఉపాధి హామీ చట్టం వచ్చిన తర్వాత గంజినీళ్లయినా తాగుతున్నారని తెలిపారు. ఈ పథకం అమలు చేయకపోతే పేదలు ఆకలితో అలమటించాల్సి వస్తుందని ఈ పథకాన్ని రక్షించుకునేందుకు సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఏటా పది లక్షల మంది సుధీర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. మన జిల్లాకు వరంగా ఉన్న ఈ పథకాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, మన జిల్లా పార్లమెంటు సభ్యుడు అందరికీ అర్జీలు ఇస్తాడు కానీ రూ.10 లక్షల మంది వలసలు పోతారని జిల్లాలోని నోరు మెదపలేని దౌర్భాగ్య పరిస్థితిలో పార్లమెంటు సభ్యులు ఉన్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి సభ్యులు టి. రాముడు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం డి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు, జిల్లా నాయకులు సి.గురు శేఖర్, ఎన్.అలివేలమ్మ, నగర నాయకులు విజయ్, నగేష్, సాయిబాబా, నరసింహులు, సుధాకారప్ప, ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన యుటిఎఫ్ బృందం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ సుధాకర్‌ను శుక్రవారం యుటిఎఫ్ జిల్లా ప్రతినిధిబృందం కలిసి అభినందనలు తెలిపారు. ఈ బృందంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఆర్ఎ. రవికుమార్, జి.నవీన్‌పాటి, జిల్లా సహాధ్యక్షుడు జి. హేమంత్ కుమార్, జిల్లాఆర్థిక కార్యదర్శి కె. యెహోషువ, జిల్లా కార్యదర్శి సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ సర్వేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు దుర్గాప్రసాద్‌లు ఉన్నారు. డిఇఒకు జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిపిఒ నేతలకు హామీ ఇచ్చారు.

దళితునిపై దాడి చేసిన శివరాంను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లాభం వస్తే పంచుకు తింటాం నష్టం వస్తే చంపుకు తింటాం అన్న చందంగా దళితులపై కలిసి ఉంటూనే దాడులు చేస్తున్నారని, కేశవ్ పై పట్టపగలు వెన్నెముక పక్కకు జరిగేలా దాడి చేసిన శివరాం, శివ, సిద్ధుతో పాటు మరో పదిమంది పైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. దాడికి గురై ఆదిత్య ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కేశవ్‌ను కెవిపిఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం వెళ్లి పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం కేశవ్, శ్రీరామ్ కలిసి ప్రారంభించిన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాలు వచ్చినప్పుడు భాగాలు పంచుకొని, భూమి అమ్ముడుపోక ఆగిపోతే వేచి ఉండాల్సింది పోయి, డబ్బులు ఇవ్వాల్సిందే అంటూ దళితుడైన కేశవ కుటుంబం పై నానా రకాల అవమానాల పాలు చేయడం దుర్మార్గమన్నారు. రూ.10 లక్షలు చెల్లించినా రూ.17 లక్షల చెల్లించాలంటూ భయపెట్టి నోట్ రాయించుకున్నారన్నారు. డబ్బులు ఇచ్చేందుకు వెసులుబాటు లేదని, అవసరమైతే భూమిని రాసిస్తామని చెప్పినా వినకుండా ఎమ్మిగనూరులో ఒంటరిగా ఉన్న కేశవ్ భార్య మహేశ్వరిని ఇబ్బంది పెట్టడమే కాకుండా, గురువారం ఉదయం కర్నూలు చౌరస్తా లో ఒంటరిగా వెళ్తున్న కేశవ్‌పై శివరాం 10 మందితో కలిసి మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడికి గురైన కేశవ్‌కు వెన్నెముక పక్కకు జరగడంతో పాటు పది రోజుల బెడ్ రెస్ట్ అనంతరం ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెబుతున్నారంటే ఎంత తీవ్రంగా దాడి చేశారో అర్థమవుతుందన్నారు. దాడి చేసిన శివరాంతో పాటు మరో పది మందిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కేశవ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, ఎన్‌జి కృష్ణ, సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్, రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మదన గోపాల్, యేసురాజు, రమణ, చిన్న రోశయ్య, నాయకులు ప్రకాశం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో బాధితుని పరామర్శిస్తున్న నాయకులు

జిల్లాలో సుపరిపాలన వారోత్సవాలు

- కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ఈనెల 25 వరకు సుపరిపాలన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. సుపరిపాలన వారోత్సవాలు–గ్రామాల వైపు పరిపాల న కార్యక్రమంలో భాగంగా అన్ని మండల కార్యాలయా ల్లో ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ డెస్కులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో, అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో, మండల కార్యాలయాల్లో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించేందుకు స్పెషల్ డెస్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామంలోని మన ఊరి కోసం మన కృతజ్ఞతతో తిరిగి ఇచ్చేద్దాం అనే నినాదంతో కొణిదెల జననీ సేవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.ఎర్రిస్వామి ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన లక్ష్మన్న ,లక్ష్మి దంపతుల చేతుల మీదుగా అంగన్వాడి విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. మానవ దృక్పథంతో ప్రజలకు చేతనయినంత సహాయం చేస్తామని అన్నారు.



కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం టిడిపి, వైసిపిల కార్పొరేటర్ల మధ్య వాగ్వివాదంతో ప్రారంభం కాకుండానే వాయిదా పడింది. కమిషనర్ లేకుండా ఎలా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తారని వైసిపి కార్పొరేటర్లు నిలదీశారు. కమిషనర్‌గా ఉన్న వ్యక్తి అందరికీ అన్ని విధాల సహకరిస్తూ అభివృద్ధి పనులు చేస్తే బాగుంటుంది. అలా కాకుండా తనకు అనుకూలమైన వారికి మాత్రమే పనిచేస్తూ ఫోన్ చేసినా ఎత్తకపోవడం ఆయన ఒంటెత్తు పోకడకు నిదర్శనంగా నిలిచింది. కమిషనర్ లేకుండా కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించడం సరికాదంటూ వైసిపి కార్పొరేటర్లు అంతా బయటికు వచ్చి సభను వాకౌట్ చేసి వెళ్లిపోయారు. టిడిపి కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్ ను పట్టుబట్టగా సభ నిర్వహించడానికి కోరం లేదని సమావేశాన్ని వాయిదా వేసి వెళ్ళిపోయారు.





మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి

కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం

వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం చెందిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం కర్నూలు ఎస్‌వి కాంప్లెక్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రజలకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేయడమే ఈ ప్రభుత్వ అసలు అజెండా అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం అంటే పేదల భవిష్యత్తును వేలం వేయడమే అని మండిపడ్డారు. కోటి సంతకాల ఉద్యమం ప్రజల ఆక్రోశానికి ప్రతీక అన్నారు. ఇది రాజకీయ కార్యక్రమం కాదని, ప్రజల మనుగడ కోసం చేసిన పోరాటమని స్పష్టం చేశారు. ఇంత పెద్ద ఎత్తున ప్రజలు సంతకాలు చేసి వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నోరు విప్పకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అవసరమైతే కేంద్రం దాకా ఈ పోరాటాన్ని తీసుకెళ్తామని హెచ్చరించారు. చంద్రబాబు చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ప్రజలతో ఆడుకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఘాటుగా వ్యాఖ్యానించారు. వైసిపి ప్రజల పక్షాన నిలబడుతుందని, పేదల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి, తదితరులు

బాల్యవివాహాలను నియంత్రించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా నియంత్రించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి అన్నారు. శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన గోడపత్రికలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటాద్రి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, గ్రేడ్ వన్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఎం నితీష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి

-కలెక్టరేట్ ఎదుట ఆవాజ్ , ఐద్వా నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను తన పదవి నుండి తక్షణమే భర్తరఫ్ చేయాలని ఆవాజ్, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆవాజ్, ఐద్వా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నగర కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఐద్వా జిల్లా సీనియర్ నాయకులు పి.నిర్మల, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, జిల్లా కార్యదర్శి కె.అరుణమ్మ, ఆవాజ్‌నగర అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఉపాధ్యక్షులు అబ్దుల్ నయీమ్, నూర్‌వలిలు మాట్లాడారు. ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న సందర్భంగా ఒక ముస్లిం మహిళను తన బురఖానకబ్ ఇడిచి తీసేయడం ఒక వీధి రౌడీని తలపించిందని అన్నారు. ఒక సీఎం స్థాయిలో ఉండి మహిళలకు రక్షణగా ఉండాల్సిన నితీష్ కుమార్ ఒక మానసిక రోగిలా ఆ రకంగా వ్యవహరించారన్నారు. బిజెపి నాయకులు సమర్థించేవారు చెప్పే విధంగా ఫోటో కోసమే ఇది చేసి ఉండింటే బురక నికాబ్ తీయమని అడగాలే తప్ప ఆమె హిజాబ్‌ను లాగడం ఎవరికి కూడా హక్కు లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎన్‌డిఎ ప్రభుత్వం కాలరాస్తుందని, అందులో భాగంగానే ఎన్‌డిఎ నాయకత్వంలోని బీహార్ సీఎం నితీష్ కుమార్ ఒక అధికార అహంతో వ్యవహరించారన్నారు. ఇది దేశవ్యాప్తంగా బీహార్ ముఖ్యమంత్రిపై ఉమ్మి వేస్తున్నారని వారు ఘాటుగా విమర్శించారు. ఈ రకంగా దిగజారుడు వ్యవహారం చూస్తుంటే మన దేశ మర్యాదను మట్టిలో కలుపుతున్నారని విమర్శించారు. అది మణిపూర్‌లో , రాజస్థాన్‌లో, బీహారో ఇలా వరుసగా రాజకీయ పలుకుబడి ఉన్న అధికారంలో ఉన్న మందబలంతో జరుగుతున్న సంఘటనలను ఇవి ఉన్మాద చర్యలని వారు తీవ్రంగా ఖండించారు. తక్షణమే సీఎం నితీష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై బిజెపి మంత్రిగా ఉన్న ఒక అతను చాలా హేయంగా, నీఛాతీ నీచంగా ఉత్తర ప్రదేశ్ మంత్రి నిశాంత్‌నితీశ్ కుమార్‌ను సమర్థిస్తూ మాట్లాడడం బాధ్యత రాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని మహిళలందరినీ కూడా కించపరచినట్టే, అవమానించినట్టేనని అన్నారు. ఈ సంఘటన జరిగిన అనంతరం ఉద్యోగాన్నే వదిలేసి తన సొంత రాష్ట్రమైన వెస్ట్ బెంగాల్ కలకత్తాకు వెళ్లిపోయిన నుసారత్ పర్వీన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉండే మహిళలందరికి కూడా నితీష్ కుమార్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి స్థాయిలో ఉండి ఇప్పటివరకు ఈ సంఘటనపై స్పందించకపోవడం, ఖండించకపోవడం చాలా దారుణమన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా, భారత దేశ మహిళలను ఎవరు అవమానించకుండా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణాలు జరుగుతా ఉంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆవాజ్ మహిళా సంఘాలతో పాటు ఇతర ప్రజాసంఘాలనన్నింటిని కలుపుకొని ప్రజాసంఘాలు, ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ నిసార్ అహమ్మద్ తమ సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ 11 యేళ్లుగా వరుసగా మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, మానభంగాలు, నగ్నంగా ఊరేగింపులు జరుగుతున్నాయని అన్నారు. మహిళను ఒక ఆట వస్తువుగా అవహేళన చేసి స్త్రీని కించపరిచే వారిని ఉపేక్షించేది లేదన్నారు. మహిళా చట్టాలను ఈరోజు అధికారంలో ఉన్న పాలకులు నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నితీష్ కుమార్‌ను సీఎం పదవి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ నగర నాయకులు శాలిబాష, నూర్ అహ్మద్ ,హాజీబాష , యూనస్, అన్వర్, షబ్బీర్ ,అబ్దుల్ రెహమాన్, అబ్దుల్, జావిద్, అబ్దుల్ జబ్బర్, జుబేర్ అహ్మద్, బాబు, మహిళా సంఘం నగర కార్యదర్శి పద్మ, పిఎస్ సుజాత, జయమ్మ,వేణమ్మ లతో పాటు ఆవాజ్ , మహిళా సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



-కలెక్టరేట్ ఎదుట నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న పి.నిర్మల

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శుక్రవారం పసుపుల గ్రామంలోని తన స్వగృహంలో వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సారధ్యంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.



పిఎం కిసాన్ అందని రైతుల జాబితా ఇవ్వండి

మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్

ప్రజాశక్తి-కోడుమూరు : కోడుమూరు మండలంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ , రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న గ్రామాలలో వచ్చే ఖరీఫ్ , రబీ సీజన్ కు ఇప్పటి రబీ సీజన్ కు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకున్నామన్నారు. యాక్షన్ ప్లాన్ అనగా గ్రామంలో ఏరియా ఎంత ఉన్నది, ఆ ఏరియాలో ఏ ఏ పంట లేస్తున్నారు. ఎంత దిగుబడి వస్తున్నది. మార్కెట్ రేటు ఎంత ఉన్నది వీటన్నింటిని బట్టి జివిఎ గ్రామాన్ని నిర్ణయించబడుతోందన్నారు. గ్రామాల్లో రైతులకు ఫర్టిలైజర్ రసాయనకారులను అందుబాటులో ఉంచవాలనని తెలిపారు. అలాగే పీఎం కిసాన్ అందనటువంటి రైతుల జాబితాను తయారుచేసి పంపించాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. రబీ సీజన్ సంబంధించి పంట నమోదు యాప్ వచ్చినందువలన యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని పంట నమోదును త్వరగా ప్రారంభించాలని తెలిపారు. దీంతోపాటుగా రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు , స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



తపాల ప్రాధాన కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన

కక్ష సాధింపు చర్యలు విరమించుకోవాలి

సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జిలాని బాష


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పైన కక్ష సాధింపు చర్యలు విరమించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు షేక్ జిలానిబాష పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని తపాల ప్రధాన కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిలాని బాష మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పైన పెట్టిన కేసు కోర్టు కొట్టి వేసిందన్నారు. గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని పేర్కొన్నారు. మానుకోకపోతే ప్రజలు ప్రతిఘటిస్తారని పేర్కొన్నారు. కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం ఖాద్రి బాష, ఓబిసి సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బి.మహేంద్ర నాయుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ ఎ.సూర్య ప్రకాష్ రెడ్డి, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గిఫ్టుల పేరుతో సోషల్ మీడియాలలో వస్తున్న లింకులకు స్పందించకండి

-జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ లింకుల పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని ప్రజలు అప్రమతంగా ఉండాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఎస్‌పి జిల్లా ప్రజలకు పలు సూచనలు చేశారు. పండుగ సీజన్ ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. గిఫ్ట్‌ల పేరుతో సోషల్ మీడియా, ఈ-మెయిల్స్‌లలో లింక్‌లు వస్తుంటాయన్నారు. ఆ గిఫ్ట్ కార్డులను గెలుచుకోవాలంటే క్లిక్ చేయండి అని మోసాలు చేస్తుంటారన్నారు. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఓటిపిలు అపరిచిత లింక్‌లలో పంచుకోవద్దన్నారు. మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయన్నారు. ఎలాంటి అనుమానాస్పద లింకులు వచ్చినా క్లిక్ చేయొదద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ ల్యాబ్ పోలీసులకుగాని, నేషనల్ సైబర్ హెల్ప్ లైన్ 1930 కి గాని, వెబ్‌సైట్ www.cybercrime.gov.in లో గాని ఫిర్యాదు నమోదు చేయవచ్చని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. మీ సమాచారం గోప్యంగా ఉంటుందని, బాధితులు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రైల్వే ఫ్లై ఓవర్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని ఐరన్‌గల్ రైల్వే స్టేషన్ సమీపంలో జరుగుతున్న రైల్వే ఫ్లైఓవర్ పనులను జెసి నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహశీల్దార్ వేణుగోపాల్‌లు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల కోసం భూసేకరణ చట్టం కింద భూమిని సేకరించినట్లు తెలిపారు. ఇందుకు గాను మొత్తం 4.99 ఎకరాలను 16 మంది రైతులను సేకరించినట్లు చెప్పారు. రైతులకు నష్టపరిహారం చెల్లింపుల విషయమై ఆర్‌బిఐ పనులను తనిఖీ చేసి, రైతులతో చర్చించామన్నారు. త్వరగా పనులు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం చూపాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణతో కలిసి పట్టణంలోని అన్న క్యాంటీన్, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సిరుగుప్ప రోడ్డులో ఉన్న డంపు యార్డును పరిశీలించారు.


పట్టణంలో పర్యటిస్తున్న ఆర్‌డి నాగరాజు

అనంతరం కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఆదాయం రాబట్టాలని సూచించారు. ఆస్తి పన్ను పెండింగ్ ఉండకుండా ఎప్పటికప్పుడు వసూలు చేయాలన్నారు. ఆదాయ వనరులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రీవెన్స్‌లో అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోందని, ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని తెలిపారు. ప్రభుత్వం పథకాల అమలు సక్రమంగా జరగాలని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ నాసిర్ హుస్సేన్, డిప్యూటీ ఇంజినీర్ రామమూర్తి, రాజశేఖర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, ఉద్యోగులు ఉన్నారు.

మల్లెల గ్రూప్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


పట్టణంలోని క్రిస్టియన్ రిఫార్మ్డ్ చర్చి ఆవరణలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను మల్లెల గ్రూప్స్ అధినేత, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, ఆయన సతీమణి మల్లెల సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆల్ఫ్రెడ్ రాజు దంపతులు 400 మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేసి మంచి విందును అందజేశారు. క్రిస్టియన్ రిఫార్మ్డ్ చర్చి పాస్టర్ రవితేజ వాక్యోపదేశం చేశారు. జమాతే ఇస్లాం హిందూ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా మాట్లాడుతూ... ఆల్ఫ్రెడ్ రాజు గొప్ప మానవతవాది అని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సేవలు చేసే వ్యక్తి అని కొనియాడారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్కోట ఖదీర్, మూమెంట్ ఐడియల్ యూత్ పట్టణ అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్, వికలాంగుల సాధికారిక ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బీసీ నాగరాజు, మల్లెల గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీవన్ సుశీల్, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, న్యూ లైఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సామ్యేల్, మల్లెల గ్రూప్ సభ్యులు లక్ష్మిసతీష్, అజిత్, యుకె.బాలు, యుకె.గంగాధర్, డానియేలు, పిఆర్‌సి చర్చి సంఘ పెద్దలు బిఎస్ఎన్ఎల్ దేవ ప్రసాద్, చికెన్న పాల్గొన్నారు.


మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఆదోని

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆదోనికి చెందిన సూర్యనారాయణను ప్రభుత్వం ప్రకటించింది. సూర్యనారాయణ ఎంపిక పట్ల శుక్రవారం ఆదోనిలో ఆయన అభిమానులు, సన్నిహితులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సూర్య నారాయణ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కమ్మ సామాజిక వర్గంలోని పేదలకు అందేలా చూస్తామన్నారు.


అభినందిస్తున్న మల్లప్ప

సిసిఐ నిబంధనలతో అవస్థలు

- పత్తి రైతుల ఆర్తనాదాలను పట్టించుకోని ప్రభుత్వం
- ఆవేదన చెంది పత్తి ట్రాక్టర్‌ను రోడ్డుపై వదిలి వెళ్లిన రైతు

ప్రజాశక్తి - నందవరం

సిసిఐ నిబంధనలతో పత్తి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పండించిన పత్తిని సిసిఐలో అమ్మాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. తేమ శాతం ఎక్కువగా ఉండకూడదు. ఎకరాకు కొన్ని క్వింటాళ్లు మాత్రమే కొంటామంటూ సిసిఐ కొనుగోలుదారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేయడం వంటి నియమాలను ప్రభుత్వం విధించడం రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. పత్తిని అమ్మటానికి రైతులు దూరం ప్రయాణించి సిసిఐ నిబంధనల వల్ల తిరిగి వెళ్ళాల్సి వస్తోంది. దీంతో రైతులపై మరింత ఆర్థిక భారం పడుతోంది. పత్తిని తిరిగి తమ గ్రామానికి తీసుకెళ్లడంతో రైతు సుమారు రూ.5 వేలు నష్టపోవాల్సి వస్తోంది. నిబంధనలను తట్టుకోలేక ప్రయివేట్ వ్యక్తులకు, ఇతర రాష్ట్రాలకు పత్తిని తరలించి తక్కువ ధరలకు విక్రయించి రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గురువారం ముగతి గ్రామ సమీపంలో ఉన్న సిసిఐ కేంద్రం దగ్గర 'పత్తి బాగాలేదు. మీ పత్తిని తిరిగి తీసుకెళ్లండి' అంటూ కొనుగోలుదారులు చెప్పారని రైతులు వాపోయారు. రైతు ప్రాధేయపడినా కనికరించలేదని ఆ రైతు ఆవేదన చెంది పత్తి ట్రాక్టర్‌ను రోడ్డుపై వదిలి వెళ్లినట్లు రైతులు చెప్పుకొచ్చారు. అదే దారిలో మరికొంతమంది రైతులు అక్కడ ఆందోళన చేపట్టారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సద్దుమణిగించారు. రైతులు పండించిన పత్తిని అమ్ముకోలేక మొదటి నుంచి తమ బాధను ప్రభుత్వానికి, మండల అధికారులకు వినిపించినా కూటమి ప్రభుత్వానికి మాత్రం వినిపించడం లేదు. రైతుల బాధలు పట్టనట్లు వ్యవహరిస్తుండడం సిగ్గుచేటని రైతులు, ప్రతిపక్ష పార్టీ, వామపక్ష నాయకులు మండిపడుతున్నారు. నిబంధనలను సడలించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శిస్తున్నారు.


స్తంభించిన ట్రాఫిక్

నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలి

- సి.గురుశేఖర్, సిపిఎం మండల నాయకులు



పత్తి కొనుగోళ్లపై ప్రభుత్వం విధించిన నిబంధనలను సడలించి రైతులను ఆదుకోవాలి. తక్కువ దిగుబడులతో రైతులు అప్పుల పాలయ్యారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

గంజాయి బారి నుంచి విద్యార్థులను కాపాడుకుందాం

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గంజాయి మహమ్మారి బారి నుంచి భావిభారత పౌరులైన విద్యార్థులను కాపాడుకుందామని గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు తెలిపారు. గంజాయి మహమ్మారిపై యుటిఎఫ్ రూపొందించిన కరపత్రాలను శుక్రవారం పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... గంజాయి 'తన, మన' అనే విచక్షణ లేకుండా సహనాన్ని కోల్పోయి యువతను, విద్యార్థులను సంఘ విద్రోహులుగా మార్చేస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలల అత్యంత సమీపంలో వివిధ రూపాల్లో గంజాయి దొరకడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. గంజాయి బారి నుంచి విద్యార్థులను కాపాడుకోవడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు అలాంటి విద్యార్థులను గుర్తిస్తే తల్లిదండ్రుల దృష్టిలో పెట్టడం వరకే కాకుండా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. దురలవాట్ల నుంచి దూరంగా ఉంచి మంచి పౌరులుగా మార్చాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ అబ్దుల్ సలీం, తాజుద్దీన్, కిషోర్, మణికుమారి, శశికళ పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పల్లెటూరి పండగలపై అవగాహన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం విజేత టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గ్రామాల్లో జరుగుతున్న పండగలను ఘనంగా నిర్వహించారు. మత సామరస్యం కోరుతూ.. కుల, మత భేదం వీడి అందరూ సమానంగా ఉండాలని, గ్రామంలో వివిధ మతాలకు చెందిన పండగలను ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా చిన్నారులు మార్గశిర అమావాస్య, రంజాన్ నమాజు, క్రిస్మస్ చర్చి క్రీస్తు జననం నమూనా.. ఆటపాటలతో చక్కని జానపద నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, ఉపాధ్యాయులు తారా, రమాదేవి, శాలిని, రేష్మ, కళింగ, ముక్కరయ్య, పవన్ కుమార్ హాజరయ్యారు. వినోదంతో పాటు పిల్లల తల్లిదండ్రులు పసందైన వంటకాలతో పండగ వాతావరణాన్ని తీర్చిదిద్దారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.


పండగ నిర్వహిస్తున్న సిబ్బంది

కంది పంటలో గంజాయి సాగు

- కంది, మిరప పంటలో గంజాయి చెట్లను గుర్తించిన అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామంలోని పొలాల్లో కంది, మిరప పంటలో గంజాయి సాగు బట్టబయలైంది. సిఐ రవిశంకర్ రెడ్డి వివరాల మేరకు... దేగులపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 176లోని 10 ఎకరాల్లో, 173 సర్వే నెంబర్‌లో 5 ఎకరాలు ఎండోమెంట్ భూమి ఉంది. మొత్తం 15 ఎకరాల భూమిని రైతులకు సాగు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దేగులపాడు గ్రామానికి చెందిన ఉనేబాద్ శివయ్య, కంది పంట, మిరప పంటలో అక్కడక్కడ గంజాయి సాగు చేసినట్లు సమాచారం రావడంతో సిఐతో పాటు ఆలూరు ఎడిఎ చెంగల్ రాయుడు, ఆలూరు ఎక్సైజ్ సిఐ లలిత, చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత, తదితర అధికారులు శుక్రవారం దేగలపాడు గ్రామ రెవెన్యూ పొలాల్లో మెరుపు దాడులు నిర్వహించి గంజాయిని కనుగొన్నారు. అధికారులు పరిశీలన చేస్తున్నారు. పొద్దు పోయాక కూడా మిరప, కంది పంటలో గంజాయి సాగును వేరు చేసే పనిలో ఉన్నారు. దాదాపు 250 మొక్కల నుంచి 300 వరకు ఉంటాయని అంచనా వేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రెవెన్యూ కార్యదర్శి ఆంజనేయులు, పోలీసులు షబ్బీర్, ఖాదర్ వలీ, శంకర్ ఉన్నారు.


వివరాలు తెలియజేస్తున్న ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి

దుమ్ము, ధూళి భరించలేకపోతున్నాం..

-హాల్విలో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కౌతాళం

ఇసుక లారీల రాకపోకలతో వస్తున్న దుమ్ము, ధూళిని భరించలేకపోతున్నామని మండలంలోని హాల్వి గ్రామంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇసుక లారీలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. మండలంలో తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలించడానికి నదీచాగి (కుమ్మలనూరు వద్ద) మురళి, గుడికంబాలి ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇసుక రీచ్ యజమానులు, ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడంతో రైతులు, వివిధ గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు పడుతున్న కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక, చివరికి ఇసుక లారీలను అడ్డుకొని నిరసన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇసుక లారీల వల్ల రోడ్డు పక్కన ఉన్న ఇరువైపులా షాపుల్లోకి విపరీతంగా దుమ్ము పడుతోందని లారీలను నిలిపివేశారు. ఇసుక రీచ్ నుంచి నీళ్ల ట్యాంకర్ వచ్చి రోడ్డుపై నీళ్లు కొట్టడంతో గ్రామస్తులు లారీలకు అడ్డు తొలిగారు. ఈ ఇసుక లారీల వల్ల హాల్వి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకణాలు, హోటల్లు, నివాసముంటున్న గృహాలు, పొలాల్లోని పంటలపై దుమ్ము, ధూళి చేరుకోవడంతో రైతులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. లారీల అతివేగం, లారీల్లో నింపిన ఇసుకపై టార్పాలిన్లు కప్పకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం. రోడ్డుపై నీళ్లు చల్లకపోవడంతో విపరీతమైన దుమ్ము, ధూళి వ్యాపిస్తోందని ప్రజలు ఆందోళన చేశారు. ఈ విషయాలపై గతంలో ఇసుక రీచ్‌ల యజమానులకు తెలిపినా పట్టించుకోలేదు. విసుగు చెందిన హాల్వి గ్రామస్తులు ఇసుక లారీలను అడ్డుకుని బైఠాయించారు. ప్రజలు ఆందోళన చేయడంతో ఇసుక రీచ్ నిర్వాహకులు, యజమానులు దిగి వచ్చి దుమ్ము, ధూళి రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.


నిరసన చేపడుతున్న గ్రామస్తులు



ఎమ్మిగనూరును జిల్లా చేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, ఆదోని ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని జెఎసి నాయకులు రంగయ్య, రాజేష్, చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ... ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలను ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజలు నిత్యం ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, గుంటూరు వంటి ప్రాంతాలకు వలసలు వెళ్తారని తెలిపారు. జిల్లా చేయడం ద్వారా ఇక్కడే అందరికీ ఉపాధి దొరుకుతుందని, వలసలను నివారించవచ్చని చెప్పారు. మంత్రాలయాన్ని పర్యాటక ప్రాంతం చేస్తూ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు బతుకమ్మ, విజయ్, రాము, వెంకటేష్, అనిల్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ఆదోని : ఆదోని మున్సిపాలిటీలోని శానిటేషన్ విభాగంలో మేస్త్రిగా విధులు నిర్వహిస్తున్న తిక్కస్వామి (54) అనారోగ్యంతో మృతి చెందారు. తిక్క స్వామి మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కాలనీలో నివాసముంటున్న తిక్కస్వామి శానిటేషన్ విభాగంలో మేస్త్రిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కొన్ని రోజులుగా బీపీ, షుగర్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య మంజుల, కుమార్తె ఉన్నట్లు చెప్పారు.

ప్రచురణార్థం

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడం ఏమనగా పద్మశాలే జయలక్ష్మీ W/o పద్మశాలే హనుమంతు, ఇంటినంబరు 21-221, బందెమిట్ట వీది, ఆదోని టౌన్, కర్నూలు జిల్లా, వారు షెడ్యూలు ఆస్తి కోతిరాళ్ళ నరసన్న మరియు జిపిఏ ఏజెంట్ వై.రవికుమార్ వారి నుండి రిజిస్టర్ విక్రయ దస్తావేజు నంబరు:-2894/2018, తేదీ 06/04/2018, ద్వారా పొందినారు. సదరు పద్మశాలే జయలక్ష్మీ W/o పద్మశాలే హనుమంతు, దీనికి లింకు దస్తావేజు కలదు దాని నంబరు 4260/2003, తేదీ:-27/12/2003, ధస్తావేజు అదృశ్యమయినయి. పైన తెలిపిన లింకు ధస్తావేజుకు సంబందించిన ఆదోని మొదటి పట్టణ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినారు, దాని నంబరు MLD 012500603679, తేదీ 13/12/2025, పైన తెలిపిన దస్తావేజుకు సంబందించి సర్వాధికారములు నా క్లయింటుకి కలవు. ఈ ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి హక్కు కానీ అధికారము కానీ ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల పైన చిరునామా తెలిపిన న్యాయవాదిని కలసి మీ యొక్క హక్కులు కానీ ఆక్షేపణలు కానీ నిరూపించుకోవలెను. లేనిచో ఈ ఆస్తిపై ఎలాంటి హక్కు అధికారములు లేవని బావించబడును.

షెడ్యూలు

కర్నూలు. రి జిల్లా, ఆదోని సబ్ రెజిస్ట్రేషన్ జిల్లా సదపురం పంచాయితీ చేరిన మండగిరి గ్రామ పంచాయితీ, ఆదోని మండలం, కర్నూలు జిల్లా, మండగిరి గ్రామములోని సర్వే నంబరు 328/B3, 338 & 339/3 in Non layout ప్లాట్ నంబరు 104,, చెక్కుబంది:-,

విస్తీర్ణం
75 చ.గజములు

చెక్కుబంది:

1. తూర్పు : 25 అడుగుల రోడ్డు
2. పడమర : 103 నంబరు ప్లాటు
3. ఉత్తరం : 15 అడుగుల రాస్తా
4. దక్షణం : ప్లాట్ నంబరు 108

A.RAJESH KUMAR,
M.A., M.Ed., LLB.
ADVOCATE,
Adoni.

సిసిఐ నిబంధనలు సడలించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పత్తి కొనుగోలులో సిసిఐ నిబంధనలు సడలించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, పత్తి రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు సి.హనుమంతు డిమాండ్ చేశారు. శుక్రవారం శివ పత్తి ఫ్యాక్టరీ వద్ద రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ... జిల్లాలో దాదాపు 20 చోట్ల సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 16 కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేసి ప్రభుత్వం పత్తిని కొనుగోలు చేస్తోందని తెలిపారు. నాణ్యత పేరుతో కొనుగోలు కేంద్రాల దగ్గరికి వచ్చిన పత్తి మొత్తం కొనుగోలు చేయకుండా అరకొరగా కొనుగోలు చేసి రైతులను తిప్పి పంపుతున్నారన్నారు. ఎన్నో కష్టాలు పడి స్లాట్ బుక్ చేసుకుని కొనుగోలు కేంద్రాల దగ్గరికి వెళితే.. రాత్రి వరకు అక్కడే పెట్టుకొని రైతులను తిరిగి పంపడంతో తక్కువ ధరకు ప్రయివేట్ ఫ్యాక్టరీల్లో అమ్మి నష్టపోతున్నారని తెలిపారు. క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు మాత్రమే బయట ఫ్యాక్టరీలో, మార్కెట్లలో కొంటున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని నిబంధనలను తొలగించి రైతు దగ్గర ఉన్న ప్రతి కిలోను కొనుగోలు చేయాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించా రు. అనంతరం సీసీఐ అధికారి వచ్చి రైతుల దగ్గరున్న పత్తిని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాస్తారోకో విరమించారు. అనంతరం సిసిఐ అధికారి వచ్చి రైతుల దగ్గరున్న పత్తిని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా నాయకులు లక్ష్మీ నరసయ్య, నరసింహులు, రైతు సంఘం నాయకులు రాముడు, డివైఎఫ్ఐ నాయకులు సురేష్ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు


నూతన పైపులైన్ వేయిస్తున్న సర్పంచి

తాగునీటి సమస్యకు పరిష్కారం

- చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో తాగునీటి సమస్య ఉన్న వీధుల్లో నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత పది రోజుల క్రితం కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పర్యటించారు. తాగునీటి సమస్య ఉందని ఆమె దృష్టికి తేవడంతో ఆమె స్పందించి పరిష్కరించాలని సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, సర్పంచికి ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన పైపులైను వేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు సర్పంచి తెలిపారు. నూతన సచివాలయానికి నూతన పైపులైన్ వేసి తాగునీరు అందించామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా తాగునీటి సమస్య రాకుండా చూసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం భక్తులతో కొలాహలంగా మారింది. శుక్రవారం అమావాస్య కావడంతో భక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చారు. భక్తులు పుణ్య స్థానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం వారు తీరారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి, దేవాలయ సిబ్బంది భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యాలతో పాటు, లక్ష పుష్పార్చన, నవగ్రహ ప్రదక్షిణలు, యాగశాల, గణపతి, అమ్మవారి దర్శన సౌకర్యాలు కల్పించారు. నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ పరిసరాలు విశాలం కావడంతో భక్తులు సులభంగా వివిధ ప్రదేశాలను సందర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అన్ని సౌకర్యాలను కల్పించారు.

యువతకు ఆదర్శం.. రంగప్ప

- మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం


రంగప్ప

రంగప్ప యువతకు ఆదర్శమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నందవరం గ్రామానికి చెందిన రంగప్ప ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. నందవరం గ్రామానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆయన పోరాటాలను గుర్తించి ఎస్ఎఫ్ఐ ఉన్నతమైన స్థానాన్ని కల్పించిందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని తెలిపారు. అనంతరం రంగప్పకు శుభాకాంక్షలు తెలిపారు.

25, 26వ తేదీల్లో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో క్రిస్మస్ పండగ సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. క్రిస్మస్ సందర్భంగా ఈనెల 25, 26వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుం రూ.1000 చెల్లించాలని కోరారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, రెండో బహుమతి రూ.35 వేలు వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, మూడో బహుమతి రూ.25 వేలు వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి, నాలుగో బహుమతి రూ.15 వేలు వైసిపి సీనియర్ నాయకులు, కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ దాసరి ఉుముంబ, ఐదో బహుమతి రూ.10 వేలు సర్పంచి అరుణ్ కుమార్, ఆరో బహుమతి రూ.5 వేలు వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ మండల ప్రెసిడెంట్ పులి నరేష్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9642045942, 9985002691 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

హాలహర్వికి కోసిగి ట్రెయినీ ఎస్ఐ బదిలీ


ప్రజాశక్తి - కోసిగి

కోసిగి పోలీసు స్టేషన్‌లో ట్రెయినీ ఎస్ఐగా పని చేస్తున్న ఈశ్వర రావు శుక్రవారం ట్రైనింగ్ పూర్తి చేసుకుని హాలహర్వి పోలీసు స్టేషన్‌కు బదిలీ అయినట్లు సిఐ మంజునాథ్, ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ట్రెయినీ ఎస్ఐ శిక్షణ సమయంలో చూపిన క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన, బాధ్యతాయుతమైన పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులను శ్రద్ధగా విని చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేయడం, శాంతి భద్రతల నిర్వహణలో సిబ్బందితో సమన్వయం పాటించడంలో పనితీరు ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎస్ఐ ఈశ్వర్ రావు మాట్లాడుతూ... కోసిగి సిఐ, ఎస్ఐ, స్టేషన్ సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీమఠానికి బియ్యం బస్తాలు విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి భక్తులు బియ్యం బస్తాలను విరాళంగా ఇచ్చారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం గొబ్బూరుకు చెందిన భక్తులు నాగరాజు, సోమిరెడ్డి 25 కిలోల బియ్యం (41 బస్తాలు) బస్తాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతేడాది భక్తితో స్వామి వారికి బియ్యం బస్తాలను ఇవ్వాలని అనుకున్నామని తెలిపారు. పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు దాతలకు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.


శివారెడ్డి గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా శివారెడ్డిగౌడ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం

మాజీ ఎంపీ బుట్టా రేణుక కార్యాలయంలో వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు ఆయనకు శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆదర్శాలను, వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ బుట్టా రేణుక అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవలో నిలిచి పార్టీ బలోపేతానికి శివారెడ్డి గౌడ్ కృషి చేశారని వైసిపి నాయకులు, అభిమానులు కొనియాడారు. బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతుల్ తరపున వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు కెఆర్.రామకోటేశ్వరరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు డి.నజీర్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి కారే రాము, పట్టణ కార్యావర్గ సభ్యులు జెరుబండి రఘువీర, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి తిమ్మాపురం బజారి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- ప్రిన్స్ వహాబ్ - అన్నదానం చేసిన అన్వర్ బాష

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు ప్రిన్స్ వహాబ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా జనరల్ సెక్రటరీ వనకలదిన్నె వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడా పోటీలను ప్రారంభించారు. జిల్లాస్థాయి కబడ్డీ అసోసియేషన్ మీట్ పురుషులు, మహిళల కబడ్డీ సెలెక్షన్స్ పోటీలను ప్రిన్స్ వహాబ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం కలిసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. బైలుప్పల అన్వర్ బాష అన్నదానం చేశారు. వక్తలు ఆయనను అభినందించారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.వెంకటేష్, శ్రీకాంత్, పిఇటి, పీడీలు ఉప్పర వెంకటేశ్వర్లు, నరసింహ రాజు, శిరీష, హేమలత, వీణ, నసరుల్లాబేగ్, హారిక, సీనియర్ క్రీడాకారుడు రామకృష్ణ, రామాంజినేయులు, గుడికల్ వెంకటేష్, రాము, విశ్వేశ్వర ఆచారి పాల్గొన్నారు.


క్రీడలు ప్రారంభిస్తున్న ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వహాబ్

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా, నా క్లయింట్ గౌ. హెచ్.కె. శ్రీదేవి, భర్త: ఎ. వెంకటేశ్వర్లు, నివాసం: ఇంటి నెం. 1/3520-1, రాఘవేంద్ర కాలనీ, రెవెన్యూ వార్డు నెం.1 ఎమ్మిగనూరు పట్టణం, కర్నూలు జిల్లా వారు, క్రింద వివరించిన షెడ్యూల్ ఆస్తికి సంపూర్ణ హక్కుదారురాలై ఉన్నారు.

నా క్లయింట్ గారు, క్రింద పేర్కొన్న చట్టబద్ధ యజమానులైన (1) కె. నరసింహారావు, (2) ఆరెకటికి చిన్న నరసింహారావు, (3) కటికె ఎర్రన్న, (4) అరెకటికె లక్ష్మీబాయి వారి నుండి నమోదు చేయబడిన విక్రయ దస్తావేజు తేదీ: 27.05.2017, డాక్యుమెంట్ నెం. 3107/2017 ద్వారా ఈ ఆస్తిని కొనుగోలు చేయడం జరిగినది.

అయితే, ఈ ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ అనగా, నమోదు చేయబడిన అసలు విక్రయ దస్తావేజు తేది: 02.01.2008, డాక్యుమెంట్ నెం.12/2008 అనేది అనుకోకుండా పోయినది. దీనికి సంబంధించి విస్తృతంగా వెతికినప్పటికీ దొరకలేదు.

కావున, పై లింక్ డాక్యుమెంట్ పోయిన విషయమై ఎవరికైన ఏవైనా హక్కులు, అభ్యంతరాలు, దావాలు ఉన్న యెడల, ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 15 (పదిహేను) రోజుల లోపల క్రింద పేర్కొన్న చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను.

అంతకన్నా ఎవరి నుండి ఎటువంటి అభ్యంతరాలు అందని యెడల, పై షెడ్యూల్ ఆస్తిపై ఎవరికీ హక్కులు లేదా అభ్యంతరాలు లేవని భావించి, భవిష్యత్తు లావాదేవీలను నా క్లయింట్ గారు కొనసాగించుకొనుదురు. ఇందుకు సంబంధించి తరువాత ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించబడవు.

షెడ్యూల్ : కర్నూలు జిల్లా, యెమ్మిగనూరు రిజిస్ట్రేషన్ సబ్-డిస్ట్రిక్ట్ పరిధిలో, యెమ్మిగనూరు పట్టణంలో సర్వే నెం.111 లో గల, 111 చదరపు గజముల విస్తీర్ణం గల ఓపెన్ స్థలం.

కొలతలు: తూర్పు నుండి పడమరకు 37 అడుగులు ఉత్తరం నుండి దక్షిణానికి 27 అడుగులు మొత్తం విస్తీర్ణం : 990 చదరపు అడుగులు లేదా 111 చదరపు గజములు

సరిహద్దులు: తూర్పు : రత్న ప్రసాద్ గారి ఇల్లు పడమర : బోయ మంజునాథ్ గారి స్థలం ఉత్తరం : బోయ హనుమంతప్ప గారి ఇల్లు మరియు ఇంటి నెం. 1/3519 దక్షిణం : రోడ్డు

D. MALLIKARJUNA,
ADVOCATE
B.Com. B.L..
H.No. 1/1930, Gandhi Nagar.
YEMMIGANUR-518 360.
Kurnool (Dist), A.P





గాంధీ చౌక్ సెంటర్‌లో మౌన దీక్ష చేపడుతున్న నాయకులు

కౌలు రైతుకు మొండిచేయే..!

• ఇప్పటికీ అందని అన్నదాత సుఖీభవ • 80 శాతం సాగు కౌలు రైతుల చేతుల్లోనే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కౌలు రైతులకు అన్నింటా మొండిచేయే దక్కుతోంది. అన్నదాత సుఖీభవలోనూ వారికి అదే పరిస్థితే ఎదురవుతోంది. 80 శాతం సాగు కౌలు రైతుల చేతుల్లోనే ఉన్నా ఇప్పటికీ వారికి అన్నదాత సుఖీభవ అంద లేదు..

కూటమి ప్రభుత్వం కౌలురైతులను వంచించిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పంట పండించే కౌలురైతులను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం సొమ్ము కౌలు రైతులకు చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి ఉంది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద కౌలురైతులకు సైతం రూ.20 వేలు అందిస్తామంటూ కూటమి ప్రభుత్వం తెలిపింది. అధికారంలోకొచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకూ కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. 2024 జూన్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ రెండు ఖరీఫ్, ఒక రబీ సీజన్లు పూర్తయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. గడిచిన ఖరీఫ్ ఆరంభం నుంచి పెట్టుబడి సాయం సొమ్ము జమ చేయడం ప్రారంభించింది. మరో విడత సొమ్ము జనవరిలో వేయాల్సి ఉంది. భూయజమానులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేసిన ప్రభుత్వం కౌలురైతులను మాత్రం పూర్తిగా పక్కన పెట్టింది. కర్నూలులో 2,77,752 మంది రైతులను, నంద్యాల జిల్లాలో 2.07 మంది రైతులను లబ్ధిదారులుగా ప్రకటించారు. వారికి నగదు జమ చేసినట్లు అధికారులు ప్రకటించారు. అక్టోబర్లో కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ నెల పూర్తవుతూ, రబీ సాగు ఆరంభమైనా పెట్టుబడి సాయం సొమ్ము మాత్రం ఇవ్వలేదు.



దీంతో తాము చేసిన నేరం ఏమిటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు.

పంట నష్ట పరిహారమూ లేదు

మొంథా తుపానుకు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది. వెబ్ ల్యాండ్ ఆధారంగా పంటనష్టం నమోదు జరిగింది. దీంతో సాగుచేసిన కౌలురైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లను పంటనష్టం జాబితాలో చేర్చారు. దీంతో పంటనష్టం సొమ్ము సైతం కౌలురైతులకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పంటల బీమా సొమ్ము సైతం భూయజమానులకే అందనుంది. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టాన్ని సవరిస్తామని, కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హడావుడి సైతం చేశారు. తర్వాత మౌనం వహించారు. సాగు చేసే వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయ సాగులో కౌలు రైతులదే కీలకపాత్ర. అటువంటి కౌలురైతుల తరపున ప్రజాప్రతినిధులు ఏఒక్కరూ కనీసం నోరువిప్పని పరిస్థితి ఉంది. అధికారులు సైతం కౌలురైతుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. సమావేశాల్లో కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ప్రకటనలు చేయడం తప్ప పర్యవేక్షణ లేకుండాపోయింది. ఇప్పటికైనా కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము అందించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

'ఉపాధి'కి గాంధీ పేరు కొనసాగించాలి

- రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం భరించాలనడం సరైంది కాదు
- మౌన నిరసన దీక్షలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరునే కొనసాగించాలని, ఈ పథకానికి బీజేపీ ప్రభుత్వం పేరు మార్చడం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిపిఎం నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహం ముందు నోటికి నల్ల బ్యాడ్జీలను పెట్టుకొని సత్యాగ్రహ దీక్ష ను చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే. ఎం డి గౌస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, పట్టణ కార్యదర్శి దర్శనం లక్ష్మణ్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు పుల్లా నరసింహ, వెంకట లింగం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చుతూ ప్రజల్లో తమ నాయకుల ఉనికిని కాడుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే భారత జాతిపిత మహాత్మా గాంధీ పేరుని తొలగించి విబి జి రామ్ జిగా పేరు మార్పు చేయడానికి పార్లమెంటులో ఆమోదనికి పెట్టడం దారుణమన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని పేరు మార్పు నిర్ణయాన్నిఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలపై 40 శాతం నిధులు భారం వేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేటర్ సంస్థలకు రుణాలను 11 సంవత్సరాల కాలంలో 17 లక్షల కోట్లకు పైగా చేయించిందని కానీ దేశం అభివద్ధి చెందాలంటే పల్లె ప్రాంతాలు అభివద్ధి చెందాలని, గ్రామీణ ప్రాంతం లో ఉన్న ఏకైక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కోసం గత 11 సంవత్సరాల కాలంలో అరకొర నిధులు కేటాయించి పూర్తిగా ఎత్తివేయాలని దురుద్దేశంతో వి బి- జి రామ్- జి అనే పేరు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే విబి-జి రామ్ -జీ పేరును రద్దు చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 60 శాతం మాత్రమే ఇస్తామని, మిగిలిన 40 శాతం రాష్ట్రాలే భరించాలని, కేంద్రం ఎప్పుడు పని మొదలు పెడుతుందో కేంద్రమే తెలియజేస్తుందని రాష్ట్రాలకు ఎలాంటి హక్కు లేదని చెప్పడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకం అందకుండా నిర్వీర్యం చేసి పూర్తిగా ఎత్తివేయాలని దురుద్దేశం తో దుర్మార్గమైన విధానాన్ని అనుసరిస్తుందని మండిపడ్డారు. గాంధీని దేశమంతా జాతిపితగా గౌరవిస్తుంటే, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న బిజెపి మహాత్మా గాంధీ పైన ఉన్న అక్కస్సును వెళ్లగక్కుకునేందుకు గాడ్సే వారసులమంటూ నిరూపించుకునేందుకు పేరు మార్చుతూ లోక్ సభలో ప్రవేశపెట్టడం లౌకిక పార్టీలన్నీ వ్యతిరేకించిన బలం ఉందని ఆమోదించుకోవడం బాధాకరమన్నారు. గాంధీజీ పేరును పలుకబోమని అలా పిలిచే ఏ పథకమైనా రద్దు చేస్తామని ప్రజలకు సంకేతాన్ని మోడీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాల వెంకట్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రామచంద్రుడు, నరసింహ నాయక్, సీనియర్ నాయకులు తోట మద్దులు తదితరులు మాట్లాడారు. పట్టణ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మౌన దీక్షకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఎస్‌డిపిఐ నంద్యాల అధ్యక్షులు అజీస్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

శ్రీశైలం దర్శనం మరపురాని అనుభూతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన ఎన్నికల కమిషనర్

-భారత ప్రధాన ఎన్నికల కమిషనర్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శుక్రవారం శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి వారి దర్శనార్థం శ్రీశైలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పి సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి వారి దర్శనం చేసుకోవడం తనకు తన కుటుంబానికి లభించిన గొప్ప అదృష్టమని తెలిపారు. పరమశివుని , అమ్మవారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. శ్రీశైల దేవస్థానంలో శివశక్తుల దర్శనం తనకు, తన కుటుంబానికి మరపురాని అనుభూతిగా నిలుస్తుందని పేర్కొన్నారు. చివరగా 'జై భారత్ జై హింద్' అని నినాదం చేశారు.

భారత ఎన్నికల కమిషనర్‌కు ఘనస్వాగతం

పుష్పగుచ్ఛం అందజేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్, కలెక్టర్

శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి వార్ల దర్శనార్థం శ్రీశైలానికి వచ్చిన భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పి సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేశారు. రత ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ గారి ధర్మపత్ని శ్రీమతి అనురాధ కుమార్ గారు కూడా స్వామి వార్ల దర్శనార్థం హాజరయ్యారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి : సిఐటియు

- నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై లాఠీ-ఛార్జీ పట్ల ఖండన

ప్రజాశక్తి - ఆత్మకూరు

నెల్లూరులో న్యాయమైన సమస్యల పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీ చార్జి చేయడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సద్దాం, రామ్ నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నాగన్న లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిగిన లాఠీ చార్జిని నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ 14 రోజుల సమ్మె కాలానికి జీతాలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు 45 రోజులుగా శాంతియుతంగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నారు అయిన అధికారుల స్పందన లేకపోవడంతో గత మూడు రోజుల నుంచి విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం సందరరేగా అధికారులను నేరుగా కలిసి తమ గోడును విన్నవించాలని లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించకుండా లాఠీ చార్జ్ చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మంత్రుల సబ్ కమిటీ పేరుతో కాలయాపన చేయడం కార్మికులను తీవ్ర సంత ప్తి గురి చేసిందని పేర్కొన్నారు. తక్షణమే సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు తిమ్మయ్య, రవి, రాజేష్, నాగన్న, సువర్ణమ్మ, సురేష్, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.ఏసు రత్నం

క్రిస్మస్, న్యూ ఇయర్ గిఫ్ట్
లింకులు క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ

- సోషల్ మీడియాలో మెసేజులకు స్పందించకండి
- జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చెయ్యడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని నంద్యాల జిల్లా ప్రజలు అప్రమతంగా ఉండాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలను లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దని, గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండని వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొల్పుతుందన్నారు. కావున ఎటువంటి పరిస్థితిలలోను అపరిచితుల నుంచి వచ్చిన లింక్ లపై ఏపీకే ఫైల్ క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దు. మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు మరియు మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చెయ్యాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు.



నిరసన తెలుపుతున్న ముస్లిం జెఎసి నాయకులు

నితీష్ కుమార్ క్షమాపణలు చెప్పాలి

ప్రజాశక్తి - నంద్యాల

బీహార్ సిఎం నితీష్ కుమార్ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ.. ముస్లిం జెఏసి నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. ముస్లిం జెఏసి నాయకులు మాట్లాడుతూ బీహార్ సీఎం నితీష్ కుమార్ చర్య మహిళల గౌరవం, మతస్వేచ్ఛ, మానవ హక్కులపై దాడిగా అభివర్ణించారు. ఈ చర్య ముస్లిం మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని, ముస్లిం సమాజానికి తీవ్ర వేదన కలిగించిందన్నారు. నితీష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను టార్గెట్ చేస్తూ, ముస్లిం జీవన విధానాన్ని అవమానిస్తూ హిందూ-ముస్లిం సోదరభావాన్ని దెబ్బతీసే రాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నితీష్ కుమార్ తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని, బాధిత మహిళా వైద్యురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌలాన అబ్దుల్లా రషాది (కన్వీనర్, ముస్లిం జేఏసీ), ఎస్ఎండి అబులైస్ (వ్యవస్థాపక అధ్యక్షుడు), ఎస్ అబ్దుల్ సమద్ (అధ్యక్షుడు, జమాతే ఇస్లామీ హింద్), ఎజాజ్ హుస్సేన్ (అధ్యక్షుడు ఎస్‌డిపిఐ), సిపిఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్, ఇన్సాఫ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రియాజ్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు మస్తాన్, ఏఐసిటియు నాయకులు మహమ్మద్ గౌస్, సిపిఎం లక్ష్మణ్, మహిళా నాయకురాళ్ళు జరీనా బేగం, సల్మా, బాజీ హలీమా సాదియా, ఎఐఎంఐఎం నాయకులు అయ్యూబ్, సమీర్, మౌలానా రియాజ్, అన్సర్, కూరగాయల మార్కెట్ అధ్యక్షులు అర్షద్, జాకీఉల్లా, మజీద్ ఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు పిన్నాపురం ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - పాణ్యం

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు పాణ్యం మండలం పిన్నాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సుమీయోన్ ఎంపికైనట్లు ఎంఇఒ కోటయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎస్‌పిజి హై స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉపాధ్యాయుల విభాగం పోటీల్లో పిన్నాపురం జడ్పీ హైస్కూల్ సుమియోన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 23, 24న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉపాధ్యాయుడు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ఏ విధంగా వినియోగించుకోవాలో అనే అంశంపై చేసిన ప్రేరణాత్మక ప్రయోగానికి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. సుమియోన్‌ను డిఇఒ పి. జనార్దన్ రెడ్డి, ఎంఇఒలు కోటయ్య, సుబ్రమణ్యం, ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

లాఠీలు, తూటాలతో ఉద్యమాన్ని ఆపలేరు : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

లాఠీలు, తూటాలతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరమేష్ అధ్యక్షతన శుక్రవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై లాఠీఛార్జీ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళనకు దిగడం తప్పా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరలేదని, చంద్రబాబు ఆస్తులు అడగలేదన్నారు. 14 రోజుల సమ్మె కాలానికి జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు 45 రోజులుగా శాంతియుతంగా ఆందోళనలు నిర్వహించారని గుర్తు చేశారు. అధికారుల్లో స్పందన లేకపోవడంతో మూడు రోజుల నుంచి విధులను బహిష్కరించి సమ్మెకు దిగారని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా అధికారులను నేరుగా కలిసి తమ గోడును వినిపించుకోవాలని వెళ్తున్న కార్మికులపై లాఠీఛార్జీ చేసి మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మంత్రుల సబ్ కమిటీ పేరుతో కాలయాపన చేయడం కార్మికులను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేని ఎడల సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు ఎస్ ఉస్మాన్ బాష, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, నాగేశ్వరరావు, శ్రీను, రాజు, బాసిత్, కె. నాగన్న, భాగ్యలక్ష్మి, ఎస్. నాగన్న, నాగమ్మ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

మేలైన పత్తి విత్తనాలనే ప్రాసెసింగ్ చేయాలి



పత్తి గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అనుమతులు పొందిన మేలైన విత్తనాలను మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. పత్తి విత్తన శుద్ధి కేంద్రాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నంద్యాల శ్రావణ లక్ష్మి సీడ్స్‌లో పలు రిజిస్టర్‌లు పత్రాలు, కంపెనీల స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల పత్తి విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చెయ్యాలని, ప్రతీ గోడౌన్‌లో విత్తన నిల్వల స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి ప్రతీ రోజు అప్డేట్ చెయ్యాలని, కంపెనీల నుండి వచ్చిన పత్తి విత్తనాలు తిరిగి కంపెనీకి పంపే ప్రత్తి విత్తనాల నిల్వలను కంపెనీ వారిగా రిజిస్టర్ నిర్వహించాలన్నారు. పత్తి విత్తన శుద్ధి కేంద్రాల యజమానులు అందరూ పత్తి ప్రాసెసింగ్ చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను ఇటిపి ప్లాంట్ ద్వారా శుద్ధి చెయ్యాలని సూచించారు. ప్రతి నెలా శుద్ధి చేసిన విత్తన స్టాక్ నిలువల రిపోర్ట్‌ని కంపెనీల వారీగా మండల వ్యవసాయ అధికారి ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. విత్తన చట్టం 1966కి అనుగుణంగా విత్తన శుద్ధి కేంద్రాల యజమానులు వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని, లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎఒ ప్రసాదరావు ఉన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యంపై ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్ర క్యాబినెట్ 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు 2025' ఆమోదాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, ఎం.ఆర్. నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక పాలిటెక్నిక్ కాలేజీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గతంలో 2018లో ప్రవేశపెట్టిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (హెచ్ ఇ సీఐ) బిల్లును, ఇప్పుడు 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్' పేరుతో మార్చి యూనియన్ క్యాబినెట్ ఆమోదించడాన్ని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ ఎఫ్ ఐ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. యూజీసీ, ఏఐసీ టి ఇ మరియు ఎన్ సి టి ఇ వంటి సంస్థల స్థానంలో హెచ్ ఇ సీఐ వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు లక్ష్యం అన్నారు. ఎన్ డి ఏ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మరియు ఆర్ ఎస్ ఎస్ యొక్క మతపరమైన ప్రయోజనాల కోసం విద్యా రంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్యీకరించడానికి మరియు మతతత్వీకరించడానికి ప్రయత్నిస్తోందని, కేంద్ర ప్రభుత్వ ఈ వికత ఎజెండాను ఖరారు చేసే ప్రయత్నమే ఈ చర్య అన్నారు. ఈ బిల్లు ఆమోదం వల్ల భారతదేశంలోని ఉన్నత విద్యా సంస్థల నిధులు మరియు పనితీరులో భారీ మార్పులు వస్తాయని, ఇది సామాన్య విద్యార్థులపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నంద్యాల టౌన్ నాయకులు సాయి, శివకుమార్, అనిల్, విజయ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం


బాల్య వివాహ రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - మహానంది

బాల్య వివాహాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆత్మకూరు సిడిపిఒ కోటేశ్వరమ్మ పిలుపునిచ్చారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని వెలుగు కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, విఆర్ఒలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశాలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, బాల్యవివాహాల చట్టాల గురించి శుక్రవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సంరక్షణ అధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాల్య వివాహ నిషేధ చట్టం-2006 గురించి వివరించారు. గ్రామ స్థాయి బాల్య వివాహ నిరోధక అధికారులు వారికి ఉన్న అధికారాలను వివరించారు. సంరక్షణ అధికారి దర్గయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాలలో చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ కమిటీలు, బాల్య వివాహ నిరోధక కమిటీల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రభుత్వ సంస్థలు బాల్య వివాహ రహిత భారతదేశం కోసం కలిసి పని చేయాలని కోరారు. మహానంది ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బాల్య వివాహం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాల్య వివాహం చేయడంలో పాల్గొన్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం 'బాల్య వివాహాలు చట్ట విరుద్ధం' పోస్టర్లు ఆవిష్కరించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత, ఎంఇఒ-2 విజయ్ కుమార్, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశాలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్ల పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - వెలుగోడు



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లిటిల్ ఏంజెల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మాని యేల్ అన్నారు. పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠాశాల విద్యార్థులు శుక్రవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానియేల్ విద్యార్థులతో కలిసి సైన్స్ ప్రదర్శన ప్రాధాన్యత వివరించారు. ఆయన మాట్లాడుతూ మానవాళిలో ప్రకృతి చాలా కీలకమైందని, మానవుడు అడవులను నరకడం, పరిశ్రమలు, పెట్రోల్, డీజిల్ వాహనాల ద్వారా గాలిలోని కార్బన్ ఆక్సైడ్‌ను విపరీతంగా పెంచుతున్నారని తెలిపారు. కార్బన్‌డైఆక్సైడ్ రైతులు పండించే పంట పొలాలపై సైతం ప్రభావం చూపుతుందన్నారు. గాలిలోని కార్బన్‌డైఆక్సైడ్ ఎక్కువ అయితే ప్రపంచవ్యాప్తంగా మనకు 3 వంతుల నీరు ఉంటే ఒక వంతు భూమి ఉందని ఆ సముద్రాలు ఈ కార్బన్ డైఆక్సైడ్ ఎక్కువైతే వాతావరణంలో వేడి పెరిగి సునామిలుగా మారే అవకాశం ఉందని వివరించారు. చెట్లను పెంచి గాలిలోని కార్బన్‌డైఆక్సైడ్ శాతాన్ని తగ్గిస్తే రోగాల నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు వినూత్న రీతిలో నిర్వహించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలి : సిపిఎం



నందికొట్కూరు టౌన్ : ఎమ్మెల్యేకు వినతి పత్రమిస్తున్న నాయకులు



ఆత్మకూరు : గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు


బండి ఆత్మకూరు : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఉపాధి హామీ, లేబర్ కోడ్‌లకు సంబంధించి పార్లమెంటులో చేసిన చట్ట సవరణలను ఉప సంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్యకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, పగిడ్యాల మండల కన్వీనర్ పి.పకీర్ సాబ్, నందికొట్కూరు మండలం నాయకులు టి గోపాలకృష్ణ, ఎస్ ఉస్మాన్ భాష కలిసి వినతి పత్రం అందజేశారు. ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. దాని స్థానంలో విబిజిఆర్ఏఎంజి పేరుతో పార్లమెంటులో చట్టాన్ని సవరించి పేదల కడుపు కొట్టేందుకు మోడీ ప్రభుత్వం దుర్మార్గానికి పడిగట్టిందని ధ్వజమెత్తారు. భారతదేశానికి స్వాతంత్య్రాన్ని తెచ్చిన మహాత్మా గాంధీ పేరును తొలగించడం విచారకరమన్నారు. ఇప్పటివరకు ఉపాధి హామీ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం 90శాతం వాటాను 60శాతానికి తగ్గించుకొని రాష్ట్రానికి 10 శాతం నుంచి 40 శాతానికి పెంచడం దుర్మార్గమన్నారు. దీని మూలంగా రాష్ట్రాలపై భారం పడుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పోరాటాల ఫలితంగా 2005లో తీసుకొచ్చినట్లు తెలిపారు. కరోనా సమయంలో పేదలకు పట్టెడన్నం పెట్టిందని చట్టం అద్భుతంగా పని చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని గ్యారెంటీ అనే పదాన్ని తొలగించి అవసరాన్ని బట్టి పనులు కల్పించాలని చట్ట సవరణ చేయడం ఉపాధి కూలీలకు ద్రోహం చేయడం తప్ప మరోటి కాదని ఆరోపించారు. అలాగే ఉద్యోగ, కార్మికుల ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులను బానిసలుగా మార్చేందుకు 4 లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం సిగ్గుచేటని విమర్శించారు. వీటి మూలంగా కార్మికులకు తీవ్ర హాని కలుగుతుందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చడం, మహిళలు రాత్రిపూట డ్యూటీలు చేయాలని చెప్పడం, సమ్మె చేసే హక్కు లేకుండా చేయడం, కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి కూలీలు, కార్మికులకు నష్టం జరిగే చట్ట సవరణలకు వ్యతిరేకంగా పార్లమెంటులో టిడిపి ఎంపిలు నిలబడాలన్నారు. ఈ అంశాన్ని సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

ఆత్మకూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను వ్యవసాయ కూలీలు ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ. రణధీర్ కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం ఎదుట పట్టణ నాయకులు డి రామ్ నాయక్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎ. సురేంద్ర, షైక్ ఇస్మాయిల్, జి. నాగేశ్వరరావు, ఎన్. వీరన్న, ఎ. కిరణ్, మహమ్మద్, నబి, సామేలు, లైట్ బాష, మియ్యాన్, నరసింహారెడ్డి, చౌదరి, దస్తగిరి, శీను, మద్దిలేటి, వలి పాల్గొన్నారు.

బేతంచెర్ల : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ భారత జెండా ఎదుట మహాత్మా గాంధీ చిత్రపటానికి మండల కార్యదర్శి మధు శేఖర్, సీనియర్ నాయకులు ఎల్లయ్య, రామాంజనేయులు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో మౌన దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజబాబు, టింగు, నాగరాజు, వెంకటరమణ, వెంకటేష్ నాయక్, గఫార్, సోమ నాయుడు, మధు, వెంకట్రామిరెడ్డి, పరుశు రాముడు, వెంకటేశ్వర్లు, సాంబార్ మధు, గద్ద గఫూర్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి : గ్రామీణ పేదలకు వలసలను నివారించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో 2005లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకే కేంద్రం కొత్త బిల్లు తీసుకొచ్చి జాతిపిత మహాత్మాగాంధీని అవమానించిందని గాడ్సే వారసులకు తగిన గుణపాఠం తప్పదని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు, సిఐటియు మండల కన్వీనర్, కో-కన్వీనర్ భాస్కర్ రెడ్డి, నాగమద్దయ్య, ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం, సిరిన, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి హెచ్చరించారు. స్థానిక గాంధీ విగ్రహం ముందు వారు నల్ల కండువాలు వేసుకొని నిరసన తెలిపారు. పేద ప్రజలకు అన్ని విధాల హాని చేసే కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మాధవి, బీబీ, నాగరాజు, వడ్డే శ్రీను, రాజ్ కుమార్, ఖాజా ఉస్సేన్, ప్రతాప్, నాగేశ్వరరావు, మినల్ల, ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పేరు మార్చి నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని దీనివల్ల గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు నోటికాడికూడు తీసివేసేలా ఉందని సిపిఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, సిఐటియు నాయకులు రాజు ఆరోపించారు. పార్నపల్లి గ్రామంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఏ కోడూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మౌనదీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్ స్వామి, సిఐటియు మండల నాయకులు రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాణ్యం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, భారత జాతిపిత మహాత్మా గాంధీ పేరుని తొలగించి విబిజిఆర్ఎఎంజి పేరు మార్పు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలపై 40శాతం నిధులు భారం వేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పాణ్యం గ్రామ పంచాయతీ ఆఫీస్ ఆవరణలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, గ్రామ పంచాయతీ కార్మికులు, ఆటో వర్కర్లు పాల్గొన్నారు.


బేతంచెర్ల : నల్లబ్యాడ్జీలతో మౌనదీక్ష చేపట్టిన సిపిఎం నాయకులు



ప్యాపిలి : నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టిన సిపిఎం నాయకులు



పాణ్యం : గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలుపుతున్న కార్మికులు



సిఎం సహాయ నిధి పేదలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

సిఎం సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేల్పనూరు గ్రామం ఎమ్మెల్యే స్వగృహంలో 32 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 15లక్షల విలువ గల సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమం తప్పకుండా సిఎం సహాయనిధి నిధులు మంజూరు చేయడంతో పేదలకు వైద్యం పరంగా ఎంతగానే ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సిఎం సహాయ నిధి అనేది పేదలకు ధైర్యం లాంటిదని, ఎంతో మంది పేదలు హాస్పిటల్లో వైద్య పరంగా ఆపద ఉన్నవారికి సకాలంలో నిధులిచ్చి వారి కష్టాన్ని దూరం చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఆధారంగా సిఎం సహాయనిధి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు సిఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

యూరియా కొరతపై అపోహలొద్దు


యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలో యూరియా కొరతపై వస్తున్న అపోహలు ఎవ్వరూ నమ్మదని రైతులందరికీ యూరియాను పంపిణీ చేస్తామని తహశీల్దార్ ఉమారాణి, ఎఒ అమీ రున్నీసా బేగం తెలిపారు. మండలంలోని గుమ్మడపురం గ్రామ పంచాయతీలో మండల టీం ఆధ్వర్యంలో శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ యూరియాపై వస్తున్న అపోహలు రైతులు నమ్మొద్దని సూచించారు. అవసరమున్న రైతులందరికీ యూరియాను అందిస్తామన్నారు. కొత్తపల్లి మండలానికి ఇప్పటివరకు 160 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకి అందజేసినట్లు తెలిపారు. రైతులు 1బి, ఆధార్, డిబిటిలో వేలిముద్ర వేయాలన్నారు. యూరియా పంపిణీలో రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు, రైతుసేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ


పంపిణీ చేస్తున్న సర్పంచి తులసమ్మ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న 38 మంది పారిశుధ్య కార్మికులకు సర్పంచి తులసమ్మ, ఎంపిడిఒ తాహీర్‌హుసేన్, ఇన్‌ఛార్జీ ఇఒ, జిఎస్‌డబ్ల్యుఎస్ డిప్యూటి ఎంపిడిఒ తారాకేశ్వరిలు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామ పారిశుధ్య నిర్వహణలో ప్రధాన భూమిక పోషిస్తున్న కార్మికులను గౌరవించుకోవడం మన కర్తవ్యం అన్నారు. ప్రతి కార్మికుడు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు


- పిఎసిఎస్ చైర్మన్ దేశం సత్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల



గడివేముల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా, డిఎపి ఎరువుల రైతులకు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఈ ఏడాది యూరియా 357.9 మెట్రిక్ టన్నులు, డిఎపి 408 మెట్రిక్ టన్నులు, 20-20-0-13లు 82 మెట్రిక్ టన్నులు, 10-26-26లు 36 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందజేశామన్నారు. రబీ సీజన్‌కు 36 మెట్రిక్ టన్నుల్లో డిఎపి, 6మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రతి రైతుకు మూడు బ్యాగుల చొప్పున యూరియాను అందజేస్తున్నామన్నారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అవుట్ స్టాండింగ్ లోన్లు రైతు మిత్ర రూ.2 కోట్లు, ఎల్టిలోన్లు రూ. 3 కోట్లు, రైతు నేస్తం కింద రూ. 9 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలోనే రైతులకు అందుబాటులో గోల్డ్ లోన్ సేవలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రతి రైతుకు ఇబ్బందులు తలెత్తకుండా యూరియాను అందజేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

స్పందనకు సమస్యల వెల్లువ


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సిరివెళ్ల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎంపిడిఒలు సి. శివ మల్లేశ్వరప్ప, అశ్విని కుమార్‌ల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పిజెఆర్‌ఎస్‌కు సమస్యలు వెల్లువెత్తాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అర్జీదారుల నుండి స్వయంగా వినతులు స్వీకరించి మాట్లాడారు. చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సేవలను పారదర్శకంగా నిర్వహించేందుకు పిజెఆర్‌ఎస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిరివెళ్ల మండలం కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు ఉన్నాయని, సిరివెళ్ల పొలిమేర పరిధిలోని 999 సర్వే నెంబర్లు అర్హులైన దళితుల పేర్లు తొలగించి ఇతరుల పేర్లు ఆన్లైన్లో అడంగల్‌లో ఎక్కించినట్లు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుండి ప్రజా సమస్యలు వెల్లువెత్తడంతో సుమారు మూడు గంటలపాటు ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. మొదట ఎంపిడిఒ శివ మల్లేశ్వరప్ప, తహశీల్దార్ విజయ శ్రీ ఇతర అధికారులు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. ప్రతి సమస్యను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, మాజీ జెడ్పిటిసి యామ గుర్రప్ప, నీటి సంఘం అధ్యక్షులు సుర రామ లక్ష్మీ రెడ్డి, బూసిరెడ్డి బీసీ ఫిదా హుస్సేన్ గిత్తల రాజు, కుమార్ ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల నుండి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఫిర్యాదు దారులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టిడిపి నాయకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

E-Procurement Tender Notice

DHONE MUNICIPALITY,

R.S Road, Dhone, Telephone No 08516 - 223281,
e-mail id: mc.dhone@cdma.gov.in

E-Tender :
Tender Notification No:- 12,13/2025-26/General Funds/E1, and 05 No's Box Tender Dt.19/12/2025 of Dhone Municipality.


Name of the Grant	General Funds 2025-26.
No. of works	02 No's 1st Call 05 Nos Box Tender
Last date and time of receipt of Tenders and sealed quotations	03.01.2026 Time: 04:30 P.M 27.12.2025 Time: 04:30 P.M

E-Tender Website : https://tender.apeprocurement.gov.in
E-Mail ID for Clarifications / Communication : mc.dhone@cdma.gov.in
Note: Any addendum / Corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Contact: No's: 9949588370 & 9949588372.

Further details can be seen @ e-procurement market place at www.tender.apeprocurement.gov.in.

Sd/-(S.Prasad Gowd)
Commissioner,
Dhone Municipality.

జలదుర్గంను మండల కేంద్రంగా ప్రకటించాలి


ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలి మండలంలోని పెద్ద గ్రామమైన జలదుర్గం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించి సిఎం గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మండల సాధన కమిటీ నాయకులు చిన్న రహీమాన్, పద్మశాలి శ్రీనివాసులు, రసూల్, నాగరాజు, చక్రాల కాజా డిమాండ్ చేశారు. మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, సిపిఎం నాయకులు జలదుర్గం గ్రామం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు శుక్రవారం పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పాదయాత్రను ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు నక్కి శ్రీకాంత్ ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ ప్యాపిలి మండలం ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతిపెద్ద మండలంగా విస్తరించిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రానికి పోవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో ఏ చిన్నపని పడిన అక్కడికి చేరుకోవాలంటే రైతాంగం ఇబ్బందులు వర్ణణాతీతమన్నారు. చుట్టుపక్కల ఉన్న కొన్ని గ్రామాలు అనంతపురం జిల్లాకు దగ్గరలో ఉన్నాయంటే ఇక్కడి ప్రజల ఇబ్బందులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సమయంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు జలదుర్గం గ్రామ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ జలదుర్గం గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలన్నదే లక్ష్యంతో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా జలదుర్గం గ్రామాన్ని మండల కేంద్రంగా చేసి ఇక్కడి ప్రజల కోరిక నెరవేరుస్తానంటూ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీ నెరవేర్చడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. జిల్లాలు, మండలాల ఏర్పాటు చేసేందుకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో జలదుర్గం గ్రామం పేరు లేకపోవడం చాలా దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలదుర్గం మండల కేంద్రంగా కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయని ఈ గ్రామంలో 15 వేలకు పైగా జనాభా, 2900 హెక్టార్ల భూమి, ప్రభుత్వ ఆసుపత్రి, హైస్కూల్, పోలీస్ స్టేషన్, హాస్టల్, పశు ఆసుపత్రి, బ్యాంక్, గ్రంథాలయం, పోస్టాఫీస్, అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు2, రైతు భరోసా కేంద్రాలు 2, ఎలిమెంట్ స్కూల్ 3 ఉన్నాయని ప్రభుత్వం జలదుర్గం గ్రామాన్ని మండల కేంద్రంగా చేస్తే గంగ్రాలా దగ్గర సర్వే 1197 సర్వే నంబర్లో 100 ఎకరాలు మండల కార్యాలయాలకు రోడ్డుపక్కనే ప్రభుత్వ భూమి ఉందని నాయకులు తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి స్పందించి సిఎం ఇచ్చిన హామీ అమలు చేసేలా జలదుర్గం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. లేని ఎడల రాబోవు రోజుల్లో రాజకీయాలకు అతీతంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలను చైతన్యవంతం చేసి కలిసి వచ్చే వారితో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎడిఒటు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రామాంజనేయులు, సిఐటియు కో-కన్వీనర్ నాగమద్దయ్య, మండల కార్యదర్శి భాస్కర్ రెడ్డి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, నాయకులు గౌండా హుస్సేన్, వడ్డే శ్రీనివాసులు, గౌండా మధు, కెవిపిఎస్ కేవీపీఎస్ నాయకులు శివ, ప్రతాప్ నాగేశ్వరావు, ఆవాజ్ కమిటీ, వైసిపి, కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఐద్వా మహిళా నాయకురాలు షమీమ్ బేగం, సిరిన, మాధవి, బీబీ, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు,
ఆళ్లగడ్డ నందు

EA: 31/2025 in EP: 01/2016 in OS:13/2013

1. కాసాని ప్రియాంక @ పాడురు ప్రియాంక
2. కాసాని మనీషా @ పుల్టూరు మనీష

...... Petitioners/ J.Ds 5 & 6

V/s

సంకేపల్లి చెన్నా రెడ్డి మరియు ఇతరులు

...Respondents /D.Hr / J.Ds 1 to 4 & 7 & others

4వ రెస్పాండెంట్ కు నోటీసు

కాసాని గంగాధర రామి రెడ్డి S/o లేట్. వెంకట నారాయణ రెడ్డి, H.No: 1-72, పెద్ద ఎమ్మనూరు గ్రామం, ఉయ్యలవాడ మండలం, నంద్యాల జిల్లా. (R4)

మహారాజశ్రీ గౌరవ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు పై పిటిషన్ దారులు, కోర్టు అటాచ్మెంట్ లోఉన్న సర్వే నెంబర్ Sy No : 218 పైకిలో ఏ : 0. 35 సెంట్లు మరియు సర్వే నెంబర్ Sy no : 769 లో ఏ: 8.40 సెంట్లు విస్తీర్ణమును 7వ రెస్పాండెంట్ (కాసాని సీత రామ లక్ష్మమ్మ), 8వ రెస్పాండెంట్ (క్ర.రా.రాజేశ్వర రెడ్డి) కి 31-01-2025న అన్యా క్రాంతము చేసినందున, సదరు రిజిస్టర్డ్ దస్తావేజు (No:313/2025) ను నిష్ఫలమైనది (Null & Void) గా తీర్మానించమని కోరుచూ పిటీషన్ దాఖలు చేయడమైనది. గౌరవ కోర్టు వారు 4వ రెస్పాండెంట్‌కు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయడమైనది. కావున ఈ విశయమై అక్షేపనలు ఉన్నఎడల గౌరవ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ 09-01-2026 తేదీన ఉదయం 10-30 ని॥లకు హాజరుఅయ్యి తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు ఈ పిటిషన్ తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది

వాయిదా తేదీ: 09-01-2026
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
అడ్వొకేటు, టి.బి. రోడ్డు : ఆళ్లగడ్డ
సెల్ : 9399993323

కార్యకర్తల అండతోనే అధికారం : ఎమ్మెల్యే



ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కార్యకర్తల అడ్డతోనే అధికారంలోకి వచ్చామని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన టిడిపి కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జీ మాండ్ర శివానందరెడ్డిలు హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త కష్టపడడంతోనే నేడు ఈ స్థాయిలో ఉన్నామని పేర్కొన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కావాలన్నా సహకరిస్తానని సిఎం నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి మండలానికి దాదాపు రూ.3కోట్లతో సీసీ రోడ్లను వేయించామని తెలిపారు. అలాగే కొణిదెల గ్రామానికి ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నిధులు రూ. 50 లక్షలు మంజూరు చేయించి ట్యాంక్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కృషితో నందికొట్కూరు నియోజకవర్గంలో 20 ఏళ్ల తర్వాత టిడిపి జెండా ఎగిరిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డి, సొసైటీ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి, సత్యంరెడ్డి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి : ఎంపిడిఒ




డ్రెయినేజీ కాల్వలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ డి. మేరి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న పరిసర ప్రాంతాలను, డ్రెయినేజీ కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ దాసరి మేరీ అన్నారు. మండలంలోని ఎం-లింగాపురం గ్రామంలో ఆమె డ్రెయినేజీ కాల్వలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాలను, డ్రెయినేజీ కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న స్వచ్ఛ భారత్ కార్మికులు ప్రతిరోజు డ్రెయినేజీ కాల్వలు శుభ్రం చేసేలా చూసుకోవాలి అన్నారు. లింగాపురం గ్రామంలో బస్టాండ్ సెంటర్లో డ్రైనేజీ కాలువ అస్తవ్యస్తంగా ఉందని స్వచ్ఛ భారత్ కార్మికులపై మండిపడ్డారు. పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే డ్రెయినేజీ కాల్వవ పూడికతీయుట పనులు చేసేందుకు ఎవరు అడ్డంకులు చేయరాదన్నారు. అనంతరం గోకవరం గ్రామ సచివాలయాన్ని, రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ప్రభుత్వం నుంచి జరుగుతున్న సర్వేలలో సచివాలయాల అధికారులు ఖచ్చితమైన సర్వేలు చేయాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపిడిఒ సుబ్బారావు, సర్పంచి మారెన్న, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి ఉన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవాలి : ఎంఇఒ


పదో తరగతి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఇఒ సుభాన్

ప్రజాశక్తి - పగిడ్యాల : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే ఇష్టంతో కష్టపడి చదవాలని ఎంఇఒ పి. సుభాన్ అన్నారు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. వంద రోజుల ఎస్ఎస్‌సి ప్రోగ్రాంను తప్పకుండా అమలు చేస్తామని, ఇష్టంతో కష్టపడి చదువుతామని విద్యార్థుల చేత ఎంఇఒ సుభాన్ ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే ఏ పరీక్షలైనా విజయం సాధించవచ్చన్నారు. పరీక్షలు రాసేటప్పుడు భయం వదిలిపెట్టాలని, ధైర్యంతో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు దగ్గరలోనే సమీపిస్తున్నాయని కష్టపడి చదవాలని తెలిపారు. అనంతరం నెహ్రూ నగర్ గ్రామంలోని ఎంపిపి పాఠశాలలను, పీకే ప్రాంగటూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు అందరూ గ్యారెంటీ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరాసి అమలు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీంచారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

మహారాజశ్రీ గౌరవ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు,
ఆళ్లగడ్డ నందు

EA: 40/2025 in EP: 59/2022 in
EP No. : 01/2016 in OS: 13/2013

1. కాసాని ప్రియాంక @ పాడురు ప్రియాంక
2. కాసాని మనీషా @ పుల్టూరు మనీష

...... Petitioners/ J.Ds 5 & 6

V/s

సంకేపల్లి చెన్నా రెడ్డి 5 మరియు ఇతరులు

...Respondents /D.Hr / J.Ds 1 to 4 & 7

4వ రెస్పాండెంట్ కు నోటీసు

కాసాని గంగాధర రామి రెడ్డి S/o లేట్. వెంకట నారాయణ రెడ్డి, H.No: 1-72, పెద్ద ఎమ్మనూరు గ్రామం, ఉయ్యలవాడ మండలం, నంద్యాల జిల్లా. (R4)

మహారాజశ్రీ గౌరవ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు పై పిటిషన్ దారులు, సేల్ వారంట్ మొత్తాన్ని కట్టుటకు అనుమతి కోరుచూ పిటీషన్ దాఖలు చేయడమైనది.గౌరవ కోర్టు వారు 4వ రెస్పాండెంట్‌కు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయడమైనది. కావున ఈ విశయమై అక్షేపనలు ఉన్నఎడల గౌరవ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ 09-01-2026 తేదీన ఉదయం 10-30 ని॥లకు హాజరుఅయ్యి తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు ఈ పిటిషన్ తీర్మానిచెదరని ఇందు మూలముగా తెలియజేయదమైనది.

వాయిదా తేదీ: 09-01-2026
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
అడ్వొకేటు, టి.బి. రోడ్డు: ఆళ్లగడ్డ
సెల్ : 9399993323

ప్రజాశక్తి
www.prajasakti.com

తూతూమంత్రంగా విచారణ

- ఆయనకు అధికారులే అండదండలు - మండిపడుతున్న మండల ప్రజలు

ప్రజాశక్తి - హోళగుంద


విచారణ చేపడుతున్న అధికారులు

డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తినిపై పత్రికలో వచ్చిన అవినీతి, ఆరోపణలపై ఆదోని డిఎల్‌పిఒ తిమ్మక్క శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో తూతూమంత్రంగా విచారణ చేపట్టారు. ఆ అధికారికి, అధికారులే అండగా ఉన్నారని మరోసారి రుజువయిందని పలువురు విమర్శిస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తి మద్యం సేవించి విధులకు హాజరైనా, వారి పక్కన కూర్చున్నప్పుడు మందు కంపు వస్తున్నా డిఎల్‌పిఒ, ఎంపిడిఒలు నోరు మెదపకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇలాంటి అధికారులకు జిల్లా అధికారులు విచారణ బాధ్యత అప్పజెప్పడం వల్ల విచారణ నీరుగారుతోంది. ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని అధికారులను వెనకేసుకుని రావడంతో పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. 'ఇదేంది విచారణ. ఇలాంటి విచారణలు అవసరమా. వారికి ఇష్టం వచ్చింది వారు రాసుకుని వెళ్లిపోతే సరిపోతుంది కదా' అని మండల ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగి మద్యం సేవించి విధులకు హాజరైతే ముందుగా క్రమశిక్షణ చర్యలు, అలాగే కొనసాగితే సస్పెండ్ చేయాలి. ఆ ఉద్యోగిలో ఎలాంటి మార్పు రాకపోతే ఉద్యోగం నుంచి తొలగించవచ్చని తెలుస్తుంది. ఇక్కడ క్రమశిక్షణ చర్య కాదు కదా మందలింపుతో సరి చేసి వెళ్లిపోవడం గర్హనీయం. కలెక్టర్ ఇలాంటి అధికారులపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆదోని జిల్లా సాధనకు త్వరలోనే బంద్

- జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని


దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న వీరేష్

ఆదోని జిల్లా సాధనకు త్వరలోనే ఐదు నియోజకవర్గాల్లో బంద్ జరిగేలా చూస్తామని జిల్లా సాధన జెఎసి నాయకులు తెలిపారు. ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన దీక్ష శుక్రవారం 33వ రోజు చేరింది. దీక్ష శిబిరానికి మద్దతుగా విద్యార్థి జెఎసి నాయకులు భీమా సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ స్తంభించిపోయింది. విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జెఎసి నాయకులు వీరేష్, అశోకనంద రెడ్డి, కృష్ణమూర్తి గౌడు, రామలింగ మాట్లాడుతూ... ఆదోని జిల్లా సాధన ఉద్యమం ఆపే ప్రసక్తే లేదన్నారు. జెఎసి నాయకులు షాబీర్, దస్తగిరి, తిరుమల, రమేష్ ఉన్నారు.

ఇంటిపై గ్రామీణుల హక్కు

ప్రజాశక్తి - హాలహర్వి

ఆస్తి హక్కుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న గ్రామీణులకు మేలు జరుగుతుందని డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మేదేహాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉన్న స్థిరాస్తుల వివరాలను గాడిలో పెట్టి వాటిపై సంబంధిత వ్యక్తులకు హక్కులు కల్పించే ప్రక్రియ ప్రభుత్వం వేగవంతం చేసిందని అన్నారు. గ్రామంలో ప్రభుత్వ లెక్కల్లో లేని అక్రమాలకు సంబంధించిన ఆస్తులను సర్వే ద్వారా గుర్తించి సంబంధిత హక్కుదారులకు యాజమాన్య పత్రాలు అందిస్తామని తెలిపారు. వివాదస్పద స్థలాలుంటే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చేస్తామన్నారు. సర్వేయర్ బీరప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుమలత, డిజిటల్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సోదర భావం కలిగి జీవించాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని


పాస్టర్లను సన్మానిస్తున్న ఉమాపతి నాయుడు

సోదర భావం కలిగి ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలని, క్రీస్తు బోధనలు ఎందరినో ప్రభావితం చేశాయని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. ఆదోని క్రైస్తవ ఐక్య సంఘాల అధ్యక్షులు పాస్టర్ ఆనంద్ రాజు అధ్యక్షతన పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో సపోజ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త విట్టా రమేష్, సామాజిక ఉద్యమకారుడు నూర్ అహ్మద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, సాష నర్సింగ్ హోమ్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆదోని క్రైస్తవ ఐక్య సంఘాల సెక్రటరీ శ్రీధర్, ట్రెజరర్ థామస్, కార్యవర్గం ఎమ్మెస్ రావు, బెనర్జీ హాజరయ్యారు. నంద్యాలకు చెందిన పాస్టర్ ఇమ్మానియేల్ వాక్యోపదేశం చేశారు. అంతకుముందు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు క్రైస్తవులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదోని క్రైస్తవ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, ఆల్బర్ట్, టిడిపి క్రిస్టియన్ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ అమర ప్రకాష్, చిరు పాల్గొన్నారు.

అభివృద్ధిపై నిరోధక స్టాంపు



-రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు చేరని స్టాంపు డ్యూటీ
-రెండేళ్లుగా నిధులు పెండింగ్
-గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు - ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు... అలాంటి గ్రామాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోంది. కానీ పల్లెల అభివృద్ధి అడుగు ముందుకు పడటం లేదు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయితీలకు అందవలసిన స్టాంపు డ్యూటీ లేదా ట్రాన్స్‌ఫర్ డ్యూటీ నిధులు అందకపోవడమే కారణంగా నిలుస్తుంది.

రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వివిధ పంచాయతీలు, మున్సిపాలిటీలు, అందవలసిన లేదా ట్రాన్స్‌ఫర్ డ్యూటీ నిధులు అందకపోవడమే కారణంగా నిలుస్తుంది. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా పలు ఆస్తుల అమ్మకాలు, కొనుగోలు నిర్వహిస్తుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ల పేరుతో రిజిస్ట్రేషన్ దారుల నుంచి స్టాంపు డ్యూటీ చార్జీలను వసూలు చేస్తోంది. ఏ ప్రాంతం నుంచి ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి. అందులో ప్రభుత్వం నిర్ణయించిన స్టాంపు డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ మొత్తాన్ని ఆ ప్రాంతాల అభివృద్ధికి రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా విభాగాలు చేసి గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్తు మునిసిపాలిటీలకు, భాగాలు చేసి ట్రెజరీ శాఖ ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. వచ్చిన ఈ నిధులను ఆయా స్థానిక సంస్థలు అభివృద్ధి కోసం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో రోజువారీగా అమ్మకం కొనుగోలు రిజిస్ట్రేషన్లను ఈ శాఖ నిర్వహిస్తుంది. వివిధ రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయంలో 0.5 శాతం, 1.5 శాతం చొప్పున రిజిస్ట్రేషన్లు వచ్చిన దానికి బట్టి విభజిస్తారు. ఆయా పరిధిలోని వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ల ద్వారా వచ్చిన మొత్తాన్ని వాటి పరిధిలోని స్థానిక సంస్థలకు విభజిస్తారు.

జిల్లాలోని వివిధ సబ్ రిజిస్టర్ కార్యాలయాల పరిధిలో భారీ మొత్తంలో ట్రాన్స్‌ఫర్ డ్యూటీలు పెండింగ్లో ఉన్నాయి. ఈ ఏడాది నవంబర్ 25వ తేదీ వరకు సుమారు రూ.70 కోట్లకు పైబడి పెండింగ్ లో ఉన్న ట్రాన్స్‌ఫర్ డ్యూటీ వివరాలను పరిశీలిస్తే ఆదోనిలో రూ.3.00 కోట్లు, ఆలూరు రూ. 1.78 కోట్లు, ఆస్పరి రూ. 1.04కోట్లు, కోడుమూరు రూ.5.50 కోట్లు, కోసిగి రూ. 2.85 కోట్లు, ఓర్వకల్లు రూ.6.16 కోట్లు, గూడూరు రూ.1.33 కోట్లు, ఎమ్మిగనూరు రూ. 3.24 కోట్లు, పత్తికొండ రూ. 2.11 కోట్లు పెండింగ్లో ఉన్నాయి. కర్నూలు రూ.18 కోట్లు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మాత్రం అత్యధికంగా 2018 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కల్లూరు రూ. 24 కోట్ల పైచిలుకు ట్రాన్స్‌ఫర్ డ్యూటీలు విడుదల కాకుండా పెండింగ్లో ఉన్నాయి.

రెండేళ్లుగా పంచాయతీలకు చేరని నిధులు

సాధారణంగా ప్రతి స్టాంప్ డ్యూటీ ఛార్జీలు మూడు నెలలకు ఒకమారు విభజించి ఆయా ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఏకంగా కర్నూలు మండలంలో సుమారు రెండేళ్లకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ గ్రామ పంచాయతీ ఖాతాలకు చేరడం లేదు. భారీ ఎత్తున పెండింగులో ఉంటే నామమాత్రంగా అప్పుడు ఇంత ఇప్పుడు ఇంత అంటూ విడుదల చేస్తున్నారు.

గ్రామపంచాయతీలో ఆగిన అభివృద్ధి

ప్రధానంగా గ్రామపంచాయతీలో రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అందాల్సిన స్టాంప్ డ్యూటీ ట్రాన్స్‌ఫార్ డ్యూటీ నిధులు సకాలంలో గ్రామాలకు చేరడం లేదు. సాధారణంగా ఈఛార్జీలు గ్రామాలకు అందడం వల్ల వాటిని వినియోగించుకొని గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీంతో ముఖ్యంగా గ్రామంలో రోడ్లు మురుగు కాలువలు వీధిలైట్లు, ఇతర అభివృద్ధి పనులు పడకేశాయి. సుదీర్ఘకాలంగా ఈ నిధులు ఆగిపోవడంతో గ్రామంలో అభివృద్ధి అటకెక్కింది.

స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

గ్రామాల్లో స్టాంప్ డ్యూటీ నిధులు అందుబాటులో లేకపోవడంతో గ్రామ సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పలువురు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. ప్రధానంగా ఇప్పటికే పంచాయతీలకు అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా పంచాయతీలకు చేరడం లేదు. దీనికి తోడుగా కనీసం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చార్జీలు కూడా అందకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తాము గ్రామాల్లో ఎలాంటి పనులు నిర్వహించలేక పోవడంతో ఇటు ప్రజల్లోనూ ముఖం చాటేయాల్సి వస్తుందన్న ఆవేదనను బహిరంగంగానే వ్యక్త పరుస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సైతం దీనిపై కక్కలేక మింగలేక అన్న చందంగా పరిస్థితి తయారయింది. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి పెండింగులో ఉన్న ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చార్జీలను వెంటనే విడుదల చేయాలని గ్రామ సర్పంచులు కోరుకుంటున్నారు. ఇటీవల కొంతమంది కర్నూలు మండలం సర్పంచులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ అంశంపై వినతిపత్రాన్ని నివేదించగా 14 రోజుల్లోపు వాటిని క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ గడువు పూర్తయిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం తీవ్ర విమర్శకు తావిస్తోంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు

జి.భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్‌కర్నూలు



ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చార్జీలు స్థానిక సంస్థలకు పంపిణీ చేయడంలో ఆలస్యమైన మాట వాస్తవమే. అయితే ప్రభుత్వం నుంచి వాటిని పంపిణీ చేయాలని మాకు ఇప్పటివరకు ఆదేశాలు అందలేదు. అందిన వెంటనే వాటిని విడుదల చేస్తాం.

రెండేళ్లుగా నిధులు రాలేదు

ఎం మాధవస్వామి, దిన్నెదేవరపాడు సర్పంచి



గ్రామాభివృద్ధికి ఉపయోగపడే ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చార్జీలు రెండేళ్లుగా అందలేదు. దీంతో గ్రామంలో అభివృద్ధి తీవ్రంగా కుంటుపడుతోంది. అభివృద్ధి చేద్దామంటే నిధులు లేవు.

కలెక్టర్ విన్నవించినా ఫలితం లేదు

ఎస్.బాలపీర, ఈ.తాండ్రపాడు సర్పంచి



ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చార్జీలను విడుదల చేయాలని గతంలో అనేక మార్లు పలువురు అధికారులను కలిసి విన్నవించాం. ఇటీవలే కలెక్టర్‌ను కలిసి విన్నవించగా 14 రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించినా ఫలితం మాత్రం కనిపించలేదు.

ట్రాన్స్‌ఫర్ డ్యూటీలను వెంటనే విడుదల చేయాలి

డి గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి



జిల్లాలో పెండింగ్లో ఉన్న ట్రాన్స్‌ఫర్ డ్యూటీ నిధులను స్థానిక సంస్థలకు వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకోవడం కాదు. నిధులను విడుదల చేసి చేతల్లో చూపాలి.

అలుపెరుగని పోరాట యోధుడు బిటి.రణదివే

ప్రజాశక్తి-కరణం కార్పొరేషన్


రణదివే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిఐటియు , ప్రజాసంఘాల నాయకులు

ఉన్నతమైన ఆదర్శవంతుడు అలుపెరుగని పోరాటయోధుడు బిటి రణదివే అని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షుడు బిటి. రణదివే 121వ జయంతిని పురస్కరించుకొని సిఐటియు నగర అధ్యక్షులు నగేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ జిల్లా నాయకులు టి.రాముడు, ఎం.గోపాలు మాట్లాడుతూ 1904 డిసెంబర్ 19న జన్మించిన బిటిఆర్ జీవితం కార్మిక వర్గ విముక్తి కోసం సాగిన పోరాటానికి ప్రతిరూపమన్నారు. 1927లో ఎం.ఏ పూర్తి చేసిన అనంతరం 1928లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో చేరి, ముంబైలోని ఎఐటియుసిలో అతి త్వరలోనే ఒక శక్తివంతమైన నాయకుడిగా ఎదిగారన్నారు. ముంబై టెక్స్ టైల్ కార్మికుల గిర్నికామ్గార్ యూనియన్ నుండి, నావికుల తిరుగుబాటుకు మద్దతుగా 1946లో జరిగిన సార్వత్రిక సమ్మె నిర్వహణలో కీలక పాత్ర వరకు ఆయన ప్రారంభ సంవత్సరాలు వలస పాలనకూ, మూలధన దోపిడీకి వ్యతిరేకంగా సాగిన సాహసోపేత పోరాటాలతో నిండి ఉన్నాయన్నారు. కార్మికుల పనిదినాలు, సంఘం పెట్టుకునే హక్కు, వేతనాలు పొందే హక్కు ఇలా ముఖ్యమైన కార్మిక హక్కుల కోసం జరిపిన అనేక పోరాటాలకు బొంబాయి కేంద్రంగా ఉండి నాయకత్వం వహించారన్నారు. 1948 నుండి 1950 వరకు ఉమ్మడి కమ్యూ నిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, తెలంగాణ సాయుధ పోరాటం వంటి చారిత్రాత్మక విప్లవ ఉద్యమాల కాలంలో పార్టీకి నాయకత్వం వహించారన్నారు. సిపిఐ ప్రముఖ నాయకుడిగా, 1964 విభజనలో సిపిఐ(ఎం) ఆవిర్భావానికి ప్రధాన శిల్పులలో ఒకరిగా నిలిచారన్నారు. నిజమైన యుద్ధోన్ముఖ కార్మిక సంఘ ఉద్యమం పట్ల ఆయన కల 1970 మే నెలలో కోల్‌కతాలో సాకారమైందన్నారు. ఐక్యత పోరాటం పేరుతో అక్కడే ఆయన సిఐటియు వ్యవ స్థాపక అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. తన జీవితాంతం కార్మికుల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం, కార్మిక, రైతు ఐక్యతను బలపరచడం అనే లక్ష్యాలతో సంఘానికి మార్గనిర్దేశం చేశారన్నారు. బి టిఆర్ లోతైన మార్క్సిస్టు,లెని నిస్టు సిద్ధాంతాన్ని అలుపెరుగని ప్రాయోగిక కార్యాచరణతో సమన్వయం చేసిన అరుదైన నాయకుడని, మహిళా సమానత్వానికి ఆయన నిబద్ధమద్దతుదారుడు కుల, సామాజిక అణచివేతలపై నిరంతరం పోరాడిన యోధుడన్నారు. తొమ్మిది సంవత్సరాల జైలు జీవితం, నాలుగు సంవత్సరాల అండర్‌గ్రౌండ్ జీవితం గడిపినా, ఆయన జీవితం సాదాసీదా సరళతతో, అచంచల నిబద్ధతతో సాగిందన్నారు. తన భార్య బిమల్ రణదీవే, సోదరి అహిల్య రంగనేకర్ తమ తమ రంగాల్లో ప్రముఖ నాయకులతో కలిసి విప్లవకారులకు ఉన్నతమైన వ్యక్తిగత ఆదర్శాన్ని నెలకొల్పారన్నారు. 18వ అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్న ఈ సందర్భంలో, బిటిఆర్ వారసత్వాన్ని కాపాడుతామని, ఆయన విస్తృత రచనల ద్వారా రాబోయే తరాలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఆయన విప్లవ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కార్మిక వర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. 1986 సంవత్సరంలో కర్నూలు నగరంలో జరిగిన సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా కర్నూలు నగరానికి వచ్చి సుందరయ్య భవన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారన్నారు. కర్నూలు జిల్లాలో అప్పుడు జరిగిన భారీ కార్మిక ప్రదర్శన బహిరంగ సభలో కార్మిక వర్గానికి సరైన సూచనలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నగర కోశాధికారి సిహెచ్ సాయి బాబా, నగర ఉపాధ్యక్షులు సుధాకరప్ప, యేసు రాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, నగర కార్యదర్శి భాస్కర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర అబ్దుల్లా ప్రజానా ట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు నోమేస్వరి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత మండలమే లక్ష్యం : డాక్టర్ రేవతి

ప్రజాశక్తి - నందవరం



పోలియో రహిత మండల మే లక్ష్యంగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, ప్రజలు కృషి చేయాలని డాక్టర్ రేవతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 32 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రం లోనూ ఎఎన్ఎం, ఆశావర్కర్, అంగన్వాడీ టీచర్, గ్రామానికి సంబంధించిన ఒక వ్యక్తిని నియమిస్తామని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు పోలింగ్ కేంద్రాల దగ్గరకు తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలు వేయించని పిల్లలకు ఈనెల 22, 23వ తేదీల్లో గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వేస్తామని తెలిపారు. మొబైల్ వ్యాన్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యావంతులు, నాయకులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి పోలియో చుక్కలు వేయించేలా చూడాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నపిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు, వారి నిండు జీవితానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అక్రమ మద్యం వ్యాపారి జయరాముడు అరెస్టు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని రామచంద్ర నగర్ కాలనీలో అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న ఈడిగ జయరాముడును అరెస్టు చేసినట్లు సిఐ రామాంజులు, ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం సిఐ ఆధ్వర్యంలో జయరాముడు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 173 మద్యం బాటిళ్లు ఉండగా రాయల్ స్టాగ్, రాయల్ ఛాలెంజర్స్, ఇంపీరియల్ బ్లూ, మ్యాన్సన్ హౌస్ వంటి బ్రాండ్ల మద్యం లభించింది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని అంచనా వేశారు. గురువారం ఇదే అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న ఈడిగ జయరాముడు భార్య ఈడిగ శారదను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఆయనలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. శనివారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

పల్స్ పోలియో విజయవంతానికి అవగాహన

డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్. భాస్కర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



మాట్లాడతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్. భాస్కర్

ఈనెల 21 ఇంటెన్సిఫైడ్‌పల్స్ పోలియో ప్రోగ్రాంలో 1630 బూతులలో 6520 వ్యాక్సినేటర్స్ ద్వారా 3,52,164 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే ఈ కార్యక్రమం విజయవంతానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన డియంహెచ్ఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలియో కేసు చివరిగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హౌరాలో 2011 జనవరి13న నమోదయిందని తెలిపారు. 2014లో పోలియో రహిత దేశంగా భారతదేశాన్ని ప్రకటించారన్నారు. మళ్లీ పోలియో రాకుండా జాగ్రత్త వహిస్తూ ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. అందరికీ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాంలో పోలియో డ్రాప్స్, ఇంజక్షన్స్ రెగ్యులర్‌గా ఒకేసారి పల్స్ పోలియో నిర్వహిస్తామని అన్నారు. అయితే పోలియో దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, సౌత్ ఆఫ్రికా వంటి దేశాలలో ఇప్పటికీ పోలియో కేసులు నమోదవుతున్నాయన్నారు. అలాంటి దేశాల నుంచి వర్క్, టూరిజం, ఇతర పనుల పై ట్రావెలింగ్ చేస్తుంటారని వారి నుండి పోలియో రాకుండా ఉండడం కోసం ముందు జాగ్రత్త చర్యగా హార్డ్ ఇమ్యూనిటీ కోసం ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో ప్రోగ్రామ్ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. అప్పటి నుండి ఈపల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. 15 డిసెంబర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ మీటింగు జరిగిందని పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కోసం ప్రణాళిక రూపొందించామని అన్నారు. అందులో భాగంగా డిసెంబర్ 21 ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 672 సచివాలయాలలో 116 మంది మెడికల్ ఆఫీసర్స్, 163 మంది సూపర్వైజర్స్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 22, 23వతేదీలలో రెండు రోజులు ఇంటింటి సర్వే నిర్వహించి మిస్ అయిన వారిని గుర్తించి వారికి పల్స్ పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో, బస్ స్టేషన్, ఎయిర్ పోర్టులలో కూడా పల్స్ పోలియో బూతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం రేడియో ప్రచారం, ర్యాలీలు నిర్వహించడం వంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి స్టేట్ అబ్జర్వర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ హాజరవుతారని తెలిపారు. గతంలో మన్యువల్ గా డేటా ఎంట్రీ జరిగిందని ఎపి పల్స్ పోలియో ఆన్‌లైన్ యాప్‌లో కూడా నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఉమా, డెమో అధికారి ప్రకాష్ రాజ్, హెచ్ఇఒ బాబా ఫక్రుద్దీన్, డిప్యూటీ హెచ్ఇఒ పద్మావతి, ప్రొజెక్షన్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కెవిఆర్ లో కరాటే బెల్ట్ గ్రేడింగ్ బ్లాక్ బెల్ట్ టెస్ట్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కెవిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలకు ఈ రోజుల్లో కరాటే, ఉషు లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. చదువుతో పాటు నచ్చిన క్రీడల్లో రాణించాలని అన్నారు. ఇప్పటిదాకా మన కాలేజీలో 100 మంది మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటూ, కరాటే విన్యాసాలు ప్రదర్శించారన్నారు. అనంతరం ఆయన బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పావని మాట్లాడుతూ 14 మంది బ్లాక్ బెల్ట్ తీసుకున్నారని, వారికి అభినందనలు తెలుపుతూ, మహిళలకు ఆదర్శం కావాలని, క్రమశిక్షణతో క్రమం తప్పకుండా నేర్చుకోవాలని చెప్పారు.

బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థినిలు: కె.నసీమ, ఎం.దేవి, సి.నందిని, జి.మైత్రి, బి.ఊహ, బివిజి.ఇందుమతి, జి.పూజిత, పి.గీత, డి.నవీన, ఎం.ధరణి, బి.శ్రీలక్ష్మి, టి.అక్షయ, వి.వీరేషమ్మ, సి.రమాదేవి. ఈ కార్యక్రమంలో కెవిఆర్.డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, ఉషు శిక్షకులు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలి

-ఆటో వడ్డాలలో జండా ఆవిష్కరణలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆటో న్యూ సిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆటో అడ్డాలలో జండావిష్కరణ కార్యక్రమాలు బళ్లారి చౌరస్తా సంతోష్‌నగర్ ,అంబేద్కర్ నగర్, కృష్ణానగర్ ,వీకర్ సెక్షన్ కాలనీలలో జెండావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సిఐటియు ఆటో యూనియన్ న్యూ సిటీ అధ్యక్షులు ఎస్. హుస్సేన్‌బాష జెండావిష్కరణలు చేశారు. అనంతరం ఆటో కార్మికలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చట్టాలను చేస్తూ యజమానులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నాయన్నారు. ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఉంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం స్త్రీలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి ఆటో కార్మికుల కడుపుకొట్టిందన్నారు. ఇప్పటికే ఆటో కార్మికులకు పెట్రోల్ డీజిల్ ధరలు , చలానా ఫీజులు పెరగడం వల్ల ఆర్థికంగా తట్టుకోలేక ఆటో కార్మికులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.30 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చాలా కాలంగా పోరాటం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 31 నుండి 2026 జనవరి 4వరకు సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు విశాఖలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రారంభించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని మహాసభల్లో తీర్మానం చేయబోతున్నారన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆటో యూనియన్ నాయకులు నభి, మధు, రాజేష్, నరసింహులు, మధు, శ్రీనివాసులు, సురేష్ మొదలగువారు పాల్గొన్నారు

చంద్రబాబుకు డాక్టరేట్ రావడం గర్వకారణం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


ఆలయ ప్రాంగణంలో ఉన్న తిక్కారెడ్డి

'ది ఎకనమిక్స్ టైమ్స్' దినపత్రిక వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'గా గుర్తింపునిచ్చి డాక్టరేట్ ప్రదానం చేయడం రాష్ట్ర ప్రజలకే గర్వకారణమని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి కొనియాడారు. శుక్రవారం ఆమావాస్య తిథి సందర్భంగా గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు శేషవస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిన్నర పాలనలోనే అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధికి మంత్రి నారా లోకేష్‌తో కలిసి పెట్టుబడులను తెచ్చారని పేర్కొన్నారు. బిజెపి ఆత్మ నిర్భర భారత్ జిల్లా కార్యదర్శి గురురాజ్ దేశాయ్, టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ గనేకంటి గురురాజ, నాయకులు గనేకంటి రామకృష్ణ, చిన్న భీమా, తిక్కస్వామి గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు పాల్గొన్నారు.

రైల్వే గేటు కష్టాలు

ప్రజాశక్తి - కోసిగి


మరమ్మతులకు గురైన రైల్వే గేటు

గ్రామంలో ఉన్న రైల్వే గేటు మరమ్మతులకు గురి కావడంతో శుక్రవారం భారీ ట్రాఫిక్ ఏర్పడింది. ట్రాఫిక్‌తో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం అమావాస్య కావడంతో రైల్వే గేటు మీదుగా ఉరుకుంద ఈరన్న స్వామి, కౌతాళం ఖాదర్ లింగ దర్గాలకు వెళ్లే భక్తులు, ఆయా గ్రామాల్లో దేవరలు జరగడంతో వాహనదారులతో పాటు గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు గంట పాటు రైల్వే గేట్ మొరాయించడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. పదేపదే రైల్వే గేటు పడడంతో జనాలు విసుగెత్తిపోతున్నారు. కోసిగి పక్కనే ఉన్న ఐరనగల్లు, కుప్పగల్లు రైల్వే గేట్లలో నూతనంగా ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత ట్రాఫిక్ ఉన్న కోసిగిలో ప్రత్యేకంగా రైల్వే ఫ్లైఓవర్, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేసి ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రబీ పంట క్రాప్ బుకింగ్ చేయించుకోండి

ప్రజాశక్తి-మద్దికేర

ప్రస్తుత రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసా యాధికారి రవి రైతులకు సూచించారు. గురువారం మద్దికేరలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించిన ఎఒ మాట్లాడుతూ ప్రతి పంట కూడా ఆర్‌బికె ఇన్‌చార్జి ద్వారా బుకింగ్ చేస్తారన్నారు. పంట వేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. లేదంటే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర, సున్నావడ్డీ తదితర ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. క్రాప్ బుకింగ్ చేస్తున్న సిబ్బందిని ఏ విధమైన పొరపాట్లకు తావులేకుండా పంట నమోదు చేయాలని సూచించారు.

సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నూర్ మహమ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షరీఫ్ బాబు డిప్యూటీ ఎంపిడిఒగా పదోన్నతిపై రాజంపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల డివిజన్ పిఆర్ కార్యాలయంలో జైపేస్‌గా విధులు నిర్వహిస్తున్న నూర్ మహమ్మద్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి రుద్రవరం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన రుద్రవరం సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి : ఎంపిడిఒ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ వరప్రసాద్

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎంపిడిఒ వర ప్రసాద్ అన్నారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపిడిఒ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని ప్రతి విఒఎ, విఒ, ఐసిలు గ్రామ సంఘం సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపైన అజెండా పెట్టి మహిళా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎ. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 80శాతం మంది ప్రజలు వ్యవసాయం పైన ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రైతులు రసాయన మందులు వాడటంతో మనం తినే ఆహారం విషతుల్యం అవుతుందన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. వీటిని అరికట్టడం కోసం ప్రభుత్వం ఎపిసిఎన్ఎఫ్ పథకం ప్రవేశపెట్టిందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ రామకృష్ణ, ఎఫ్ఎంటి చంద్రశేఖర్, విజన్ బిల్డింగ్ శిక్షకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి పల్లకి సేవ



ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వచ్ఛ గ్రామానికి కృషి చేస్తాం



ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండలంలోని ఏ కోడూరు గ్రామ పంచాయతీని గ్రామ ప్రజలందరి సహకారంతో స్వచ్ఛ గ్రామంగా తయారు చేస్తామని టిడిపి సీనియర్ నాయకులు ఒడ్డు మధుసూదన్ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ ఆయన శుక్రవారం చెత్తబుట్టలను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఇంటి పన్నులను చెల్లించి చెత్తబుట్టలు తీసుకువెళ్లాలని, తద్వారా గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించిన వారు అవుతారని తెలిపారు. చెత్త బండి వచ్చినప్పుడు మాత్రమే తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి చెత్త బండిలో వేయాలని కోరారు.

ఆత్మరక్షణ నైపుణ్యాన్ని నేర్చుకోవాలి

ప్రజాశక్తి - పాణ్యం

మహిళలు ఆత్మ రక్షణలో ఆరితేరినప్పుడే మహిళలపై అఘాయిత్యాలు తగ్గుముఖం పడతాయని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్ జెట్టి అన్నారు. ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మహిళా సాధికారత ఆత్మ రక్షణ శిక్షణలో భాగంగా మాట్లాడుతూ మహిళల భద్రత, ఆత్మవిశ్వాసం, స్వాలంబన, సమాజ అభివృద్ధికి కీలకమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సుబ్బయ్య మాట్లాడుతూ మహిళల్లో ఆత్మ రక్షణ నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు.

వికలాంగులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి - పాములపాడు

మండల పరిధిలోని వేంపెంట గ్రామంలో వికలాంగులకు, వృద్ధులకు సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరావు తరపున మాజీ సర్పంచి టేకూరి రామసుబ్బమ్మ ఆయన సతీమణి టేకూరి రేణుక శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అందరితోపాటు వృద్ధులు, వికలాంగులు పండగలకు మంచి దుస్తులు వేసుకొని సంతోషంగా గడపాలన్నారు. ప్రతి సంవత్సరం వికలాంగులకు, వృద్ధులకు బట్టలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగులమని, వృద్ధులమని అధైర్యపడొద్దు మీకు అన్ని విధాలుగా మేము తోడుగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాజకీయాలకతీతంగా, కుల మతాలకు అతీతంగా, పేదరిక నిర్మూలన కోసం మతసామరస్యంతో మానవత్వంతో అనేక సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించి, చేయూతను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేంపెంట గ్రామ బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, సుబ్బారావు, మద్దూరు ప్రసాద్, చిన్నస్వామి ఆచారి, శేషిరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు ఊయలసేవ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : లోకకల్యాణం కోసం దేవస్థానం శుక్రవారం సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ నిర్వహించింది. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఊయలలో ఆశీనులుగా చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ నిర్వహించారు. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు నిర్వహించారు. అలాగే దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా అక్షయ సోషల్ కల్చరర్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే శుక్రవారం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. నిత్య కళారాధనలో ఆయా రోజుల్లో

మహిళా ఆరోగ్య కార్యకర్తల పై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఆరోగ్య కార్యకర్తల పై అధికారుల వేధింపులు ఆపాలని, దీర్ఘకాలంగా పెండింగులో వున్న సమస్యలు పరిష్కారం కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ కు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు ఎండి అంజిబాబు, జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి , ఎపి తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మాధవరాజు లు కలిసి వినతి పత్రం యిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలు పై అధికారుల నుండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వైద్యాధికారులు మహిళా ఆరోగ్య కార్యకర్తలపై తీవ్రమైన పని ఒత్తిడితో వేధిస్తున్నారని మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఎఎన్ఎం లు దాదాపు 30 పైగా ఆన్‌లైన్ యాప్‌లతో పనిచేస్తూ నిత్యం మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని మహిళా ఆరోగ్య కార్యకర్తలు పూర్తిస్థాయిలో లక్ష్యసాధన కోసం చేస్తున్న వైద్యాధికారులు మహిళా ఆరోగ్య కార్యకర్తలను అవమానకరంగా అనుచిత పదజాలంతో సంబోధిస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. కనీసం మహిళా ఆరోగ్య కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. వైద్యాధికారులు ప్యారామెడికల్ సిబ్బందిని తమ కింద బానిసలు లాగ భావిస్తూ కనీసం ఉద్యోగులుగా వారికి ఇవ్వాల్సిన గౌరవాన్ని కూడా యివ్వడం లేదని చెప్పారు. క్షేత్రస్థాయిలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పారా మెడికల్ సిబ్బంది మాత్రమే లక్ష్య



డిఎంఅండ్‌హెచ్ఒకు వినతి పత్రమిస్తున్న సిఐటియు నాయకులు

సాధనలో తమ వంతు కృషి చేస్తున్నారని, వైద్యాధికారులు మాత్రం వారిని యిష్టారీతిగా మాట్లాడుతున్నారని అన్నారు. ఈ విధానం ఉద్యోగుల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే విధంగా వుందన్నారు. పుచ్చకాయల మాడ పిహెచ్ సి వైద్యాధికారి డాక్టరు రాఘవనాయుడు ఎఎన్ఎంలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అందుకు ఆయన వెంటనే మహిళా ఆరోగ్య కార్యకర్తలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీర్ఘకాలంగ పెండింగులో వున్న సమస్యలను కూడా పరిష్కారించాలని కోరారు. క్షేత్రస్థాయిలో సూపర్వైజర్ల పర్యవేక్షణ సందర్భంగా కొందరు మహిళా ఆరోగ్య కార్యకర్తలపై అనుచితగా ప్రవర్తిస్తున్నారని, జిల్లా నుండి వచ్చే రిపోర్టులకు సంబంధించిన అంశాలు ఎఎన్ఎంలకు పూర్తి స్థాయిలో తెలియజేయునట్లు సూపర్వైజర్లకు మార్గనిర్దేశం చేయాలని సీనియర్ ఎఎన్ఎంను డిప్యూటేషన్ వెంటనే రద్దు చేయించి, వారిని వారు జీతాలు తీసుకుంటున్న ఉపకేంద్రాలకు పంపాలన్నారు. సాధారణ సెలవుల విషయంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలకు పై అధికారుల నుండి ఎదురు అవుతున్న యిబ్బందులను తొలగించాలని, గ్రామ, వార్డు సచివాలయాలలో పని చేస్తున్న గ్రేడ్-3 ఎ ఎన్ఎంల అందరిని మాతృ సంస్థ అయినా వైద్య ఆరోగ్యశాఖలో విలీనం చేయాలన్నారు. వీలైనంత వరకు ఆన్‌లైన్‌యాప్‌లను తగ్గించి పనిభారాన్ని తగ్గించాలన్నారు. సచివాలయ ఇతర పనులు కేటాయించరాదని జిల్లా కలెక్టరు యిచ్చిన ఆదేశాలు ఉన్నప్పటికి కొంతమంది యిటువంటి గ్రామ కార్యదర్శులు ఇతర పనులు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ అంశం పైన నిర్దిష్టమైన ఆదేశాలను జారి చేయాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ సమస్యలు పరిష్కరించాలని ఎఎన్ఎం గ్రేడ్ 3 నుండి ఖాళీగా వున్న ఎంపిహెచ్ఎ(ఎఫ్) పోస్టులను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సంబంధించి సర్వీసు రిజిస్టర్లు అప్‌డేట్ చేయాలన్నారు. ఎస్ఆర్‌లో నమోదు చేయాల్సిన అంశాలు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని డిఎంహెచ్ఒను వారు కోరారు. సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి ఆర్. నరసింహులు, గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు సెక్రటరీల యూనియన్ (సిఐటియు) నాయకులు లలిత, ఝాన్సీ రాణి, జయలక్ష్మి, ఏపీ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ (టిఎన్‌టియు సి) జిల్లా నాయకులు నాగరాజు, జయకుమార్, కిరణ్ కుమార్, రోజ్ ప్రసన్నలు పాల్గొన్నారు.

చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు

ప్రజాశక్తి - రుద్రవరం

ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించి శాశ్వత అంగవైకల్యం నుంచి కాపాడాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమర్నాథ్ రెడ్డి కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న 3194 మంది 0-5ఏళ్లలోపు చిన్నారులందరికి ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పోలియో చుక్కల నిర్వహణపై ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లకు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు.

మిడుతూరు : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ దశరథరామయ్య, తహశీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియోపై మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదివార ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.



చాగలమర్రి : ఈ నెల 21న నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియోలో తల్లిదండ్రులు 0-5ఏళ్లలోపు పిల్లలందరికి చుక్కలు వేయించాలని వైద్యులు తస్లీమా సుల్తానా కోరారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలో విద్యార్థులతో కలసి గ్రామంలోని పలు వీధుల్లో పల్స్‌పోలియోపై ర్యాలీ నిర్వహించారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కవిత, ఎఎన్ఎం నూర్జహన్, ఆశా కార్యకర్తలు రజని, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గోస్పాడు : ఈ నెల 21న ఆదివారం మండల వ్యాప్తంగా జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షబ్బీర్ హుస్సేన్ వలి తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లలందరికీ రెండు చుక్కలు వేయించాలన్నారు.

పాణ్యం : పల్స్ పోలియోపై మండలంలోని ఎఆర్ కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని సచివాలయం-2 ఎఎన్ఎం సురేఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. ర్యాలీలో ఆశా వర్కర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని 0-5ఏళ్ల చిన్నారులందరికీ రెండు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తహశీల్దార్ శ్రీనివాసులు, డాక్టర్ హరి చరణ్‌రెడ్డి, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ నాగార్జున, ఎంపిడిఒ దస్తగిరి బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాల నుండి స్టేట్ బ్యాంక్, ఆర్‌టిసి బస్టాండ్ వరకు అధికారులు పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా 0-5ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు.

డిజిటల్ న్యాయంపై అవగాహనుండాలి : డిఎస్ఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్ఒ రవి బాబు

డిజిటల్ న్యాయపాలనతో వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు డిజిటల్ పాలన, ఈ-ఫైలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పౌర సరఫరాల అధికారి జె. రవి బాబు పేర్కొన్నారు. వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18 నుండి 24 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నంద్యాల ఎస్‌టి జోసెఫ్ హైస్కూల్ ప్రధాన అధ్యాపకులు రాగిణి అధ్యక్షతన విద్యార్థిని, విద్యార్థులకు డిజిటల్ పాలన వ్యవస్థపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జె. రవిబాబు, జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ బాష, జోసెఫ్ హైస్కూల్ ఉపాధ్యాయులు హాజరు అయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యతలో లోపంగాని, కొలతలలో తేడా గమనించినట్లయితే వెంటనే అధికారులను కలిసి ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు. డిజిటల్ న్యాయం అంటే ఇ-కోర్టులు, వర్చువల్ విచారణలు, ఈ-ఫైలింగ్ వంటి సాంకేతికతల ద్వారా కేసులను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై కన్స్యూమర్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగ ఉంటాయని పేర్కొన్నారు.



డిజిపితో అవార్డు అందుకుంటున్న కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

కర్నూలు పోలీసులకు రాష్ట్ర స్థాయి ఎబిసిడి అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర వ్యాప్తంగా కీలక కేసుల దర్యాప్తుల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచడాన్ని గుర్తించి ప్రతిష్టాత్మకంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రకటించే 'అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్ ' అవార్డ్ మొదటి క్వార్టర్ (జనవరి -మార్చి)2025కు ఉలిందకొండ పోలీస్ స్టేషన్ లో నమోదైన ఎటిఎం దొంగతనం కేసును చేధించినందుకుకర్నూలు జిల్లా పోలీసు విభాగం ఎంపిక అయింది. డిజిపి ప్రధాన పోలీస్ కార్యాలయం మంగళగిరిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా కర్నూలు పోలీసులు ఎబిసిడి అవార్డు స్వీకరించారు. జిల్లాలో జరిగిన ఎటిఎం దొంగతనం కేసును చేధించి చురుగ్గా వ్యవహరించిన పోలీసు అధికారులను అభినందించారు. అవార్డులు పొందిన వారిలో కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, కర్నూలు డిఎస్‌పి జె. బాబు ప్రసాద్, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబునాయుడు, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్, సిబ్బందిని అభినందించారు. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లాకు ఈ ప్రతిష్టాత్మక అవార్డ్ దక్కేందుకు సదరు కేసును చేదించడంలో కృషి చేసిన అధికారులను సిబ్బందిని కర్నూలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డును స్ఫూర్తి గా తీసుకొని, జిల్లా వ్యాప్తంగా నమోదైన మరిన్ని కేసులను సమర్థవంతంగా చేధించేందుకు మరింత కృషి చేయాలని, జిల్లాకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు సి బెళగల్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సి బెళగల్

నేడు పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు సహచర ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని పరిషత్ ఎఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత సమావేశం నుండి ఈ సమావేశం వరకు ఏ ఏ నిధులు మంజూరు అయ్యాయో, ఎక్కడెక్కడ ఖర్చు చేశారో చర్చించాల్సి ఉందన్నారు. రికార్డులతో హాజరు కావాలని ఈ సమావేశం అనంతరం చేసే అభివృద్ధి పనులకు ప్రణాళికలు వేసుకోవడానికి వీలుగా ఉంటుందని తెలిపారు.

పిహెచ్‌సి వైద్యాధికారికి 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - రుద్రవరం



పిహెచ్‌సి డాక్టర్ శివ మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

భవ్య యాజమాన్యం 104 ఎంఎంయు ఉద్యోగుల సమస్యల పరిష్కరించేలా కూటమి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భైరం ప్రశాంత్, పైలట్ రవి శేఖర్ కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివమోహన్‌కు వారు శుక్రవారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. 104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సస్పెన్షన్ లెటర్‌ను రద్దు చేసి ఉద్యోగులను డ్యూటీలో ఎక్కించుకోవాలని, భవ్య యాజమాన్యం జీతాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. 104 ఉద్యోగులకు గతంలో ఇచ్చిన విధంగానే ఏడాది 15 క్యాజువల్ లీవ్స్ ఇవ్వాలన్నారు. పూర్తిస్థాయిలో 104 వాహనాలలో బఫర్ ఉద్యోగులను తీసుకోవాలన్నారు. భవ్య యాజమాన్యం 7 నెలలు పూర్తయిన కానీ ఇప్పటివరకు పేస్లిప్పులు, నియామక పత్రాలు, ఐడి కార్డులు ఇవ్వాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 104 సంజీవినిగా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. అలాగే అరబిందో యాజమాన్యం బకాయిలను పూర్తిస్థాయిలో ఇప్పించి ఉద్యోగులందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు

'ఉపాధి హామీ' రక్షణకు నేడు నిరసనలు

- వ్యకాస, ఎపి రైతుసంఘం, సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని జీ రామ్ జీ అని పేరు మారుస్తూ చట్టాన్ని పథకంగా మార్పు చేసి నిధులు తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యానికి కుట్ర చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 20న గ్రామ, మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు తెలిపారు. కార్మిక కర్షక భవనంలో మూడు సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్పు చేసి వారికి కేటాయించిన నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం 40శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాలని, అలాగే చట్టాన్ని పథకంగా మార్పు చేసి కాలక్రమంగా ఉపాధి హామీ పథకాన్ని పేదలకు దూరం చేయాలని ఒక దుర్బుద్ధితో కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. పార్లమెంట్లో అడ్డగోలుగా ఆమోదం తీసుకొని పేదలకు ఉపాధి దూరం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మన రాష్ట్రంలో ఈ ఉపాధి హామీకి ప్రతి ఏడాది రూ.4000 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని, అయినా నిస్సిగ్గుగా పార్లమెంట్లో అధికార ప్రతిపక్ష ఎంపీలు ఆమోదానికి ఓటు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. కర్నూలు జిల్లాలో నిత్యం కరువు కాటకాలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఏటా 10 లక్షల మంది సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. వలసల నివారణ కోసం తెచ్చిన ఈ చట్టాన్ని రూపుమాపి నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే నోరు మెదపని దౌర్భాగ్య పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. గ్రామీణ పేదలకు, రైతులకు, కార్మికులకు, వరంలా ఉండే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుంటామని అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 20న నిర్వహించే గ్రామ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మార్కెట్‌కు క్రిస్మస్ కళ

- వివిధ మోడళ్లలో స్టార్లు, క్రిస్మస్ ట్రీలు
- ప్రత్యేక ఆకర్షణగా శాంతా క్లాజ్ డ్రస్‌లు
- క్రైస్తవుల ఇళ్లల్లో మొదలైన పండగ సంబరాలు



క్రిస్మస్ స్టార్స్, అలంకరణ వస్తువులు

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రపంచంలోనే అతి పెద్ద పండగ క్రిస్మస్. క్రిస్మస్ పండగను క్రైస్తవులు ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. నిరుపేదలు

జరుపుకుంటారు. క్రీస్తు జననానికి చిహ్నంగా జరుపుకునే క్రిస్మస్ పండగ మరో వారం రోజులు ఉండగానే మార్కెట్‌కు క్రిస్మస్ కళ వచ్చింది. క్రిస్మస్ పండగకు అవసరమయ్యే

అందుబాటులో ఉంచారు. వివిధ మోడళ్లలో స్టార్‌లు, శాంతా క్లాజ్ (క్రిస్మస్ తాత) బొమ్మలు, క్రిస్మస్ ట్రీలు, డింగ్ డాంగ్ బెల్స్‌తో పాటు క్రిస్మస్ అలంకరణకు సంబంధించిన అన్ని వస్తువులు మార్కెట్లో లభిస్తున్నాయి.

అనేక మోడళ్లలో.. : క్రిస్మస్ పండగకు ప్రధానమైనది స్టార్. వ్యాపారులు అనేక మోడళ్లలో స్టార్లను అందుబాటులో ఉంచారు. ఒక్కో స్టార్ రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. అలానే క్రిస్మస్ డెకరేషన్‌కు సంబంధించిన వస్తువులు కొనుగోలు చేసేందుకు క్రైస్తవులు ఆసక్తి చూపుతున్నారు. వివిధ రకాల్లో శాంతాక్లాజ్ (క్రిస్మస్ తాత) మాస్క్‌లు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే అనేక మంది క్రైస్తవులు వారి ఇళ్లపై స్టార్‌లను ఏర్పాటు చేసుకున్నారు. అనేక ప్రాంతాల్లో చర్చిలను ముస్తాబు చేసే పనులను ప్రారంభించారు. క్రిస్మస్ పండగ సమీపి స్తుండటంతో చర్చిలలో